http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

బుధవారం 5 జూన్ 2025

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

# రాజకీయల్లో రగడ!

- రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీల్లో అంతర్గత పోరు
- కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల్లో రచ్చ
- అసమ్మతి స్వరాలు, అసంతృప్తి జ్వాలలతో సతమతం
- కాంగ్రెస్‌లో తేలని కేబినెట్ విస్తరణ..ఆశావహుల నిరసన గళం
- పార్టీ పదవుల లొల్లి.. గాంధీభవన్‌లో మహిళా నేతల ధర్నా
- ఎమ్మెల్సీ కవిత రె'బెల్స్'తో బీఆర్ఎస్‌లో దుమారం
- జాగృతి బలోపేతమంటూ పార్టీకి సమాంతరంగా కార్యకలాపాలు
- కమలంలోనూ కలహాలు.. నేతల్లో కొరవడిన ఐక్యత..

హైదరాబాద్

రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీలు. ఒకటి అధికార కాంగ్రెస్, రెండోది ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్, మూడవది జాతీయ పార్టీ బీజేపీ. ఏ చిన్న అవకాశం దొరికినా ప్రత్యర్థి పార్టీలపై ఆరోపణలు, విమర్శలతో విరుచుకుపడుతుంటాయి. ప్రజల దృష్టిని తమ వైపునకు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తుంటాయి. కానీ ప్రస్తుతం.. ఈ మూడు ప్రధాన రాజకీయ పక్షాలూ వేటికవే తమతమ పార్టీల్లో అసమ్మతి స్వరాలు, అసంతృప్తి జ్వాలలు, అంతర్గత కుమ్ములాటలు, విభేదాలతో సతమతమవుతున్నాయి. ఏ పార్టీకి ఆ పార్టీలో లుకలుకలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువని చెప్పే కాంగ్రెస్ పార్టీలో ఇలాంటివి సహజమే అయినా క్రమశిక్షణకు మారుపేరని భావించే బీజేపీ, ఏకఛత్రాధిపత్యం కింద నడిచే ప్రాంతీయ పార్టీ బీఆర్ఎస్‌లో కూడా రాజకీయ రచ్చ కొనసాగుతుండటం గమనార్హం. అయితే గ్రూపులు, గొడవలకు పుట్టినిల్లు లాంటి కాంగ్రెస్ పార్టీలో రహస్య కొట్లాటలు జరుగుతుంటే, బీజేపీ, బీఆర్ఎస్‌లలో మాత్రం విభేదాలు బహిరంగమవుతుండటం మరో విశేషం. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతోంది. ఏడాదిన్నరలోనే ప్రభుత్వ పాలన, ప్రభుత్వ.. పార్టీ పదవులు, ప్రాధాన్యత, మంత్రివర్గ విస్తరణ, మంత్రుల వ్యవహారశైలి తదితర అంశాలు చర్చనీయాంశమవుతున్నాయి. అంతర్గత విభేదాలకు, ఫిర్యాదులకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా మంత్రివర్గ విస్తరణ అంశం ఏడాదిన్నర తర్వాత కూడా కొలిక్కి రావడం లేదు. ఎన్నిసార్లు ఢిల్లీ చుట్టూ తిరిగినా, హైదరాబాద్‌లో చర్చలు జరిగినా తేలడం లేదు. అదిగో విస్తరణ...ఇదిగో విస్తరణ అంటూ ఎప్పటికప్పుడు దాటవేతతో విసుగు వచ్చిన ఇద్దరు - మిగతా3లో



## కుల గణనపై కేంద్రం కీలక నిర్ణయం

- తదుపరి దేశ జనాభా గణన 2027, మార్చి ఒకటి నుంచి ప్రారంభం
- 2026 అక్టోబర్ నుంచే లడఖ్, జమ్మూకశ్మీర్ హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ తదితర ప్రాంతాలలో ప్రారంభం
- జనగణనను రెండు దశల్లో నిర్వహించనున్న ప్రభుత్వం
- దేశవ్యాప్తంగా ఉన్న పురుషులు, మహిళల గణాంకాలతో పాటు, వారి కులం, ఉపకులాలపై ప్రభుత్వం సమాచారం సేకరణ



## రక్షణ ఇవ్వండి.. నిజాలు బయటపెడతా..

- ఫోన్ ట్యాపింగ్‌పై నందకుమార్
- 2022 ఎమ్మెల్యేల కొనుగోలు కేసులు నందకుమార్ నిందితుడిగా ఉన్న విషయం తెలిసిందే.
- ప్రభాకర్ రావు వచ్చినా కూడా న్యాయం జరగదు
- ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆల్రెడీ మ్యాచ్ ఫిక్సింగ్ జరిగింది
- ఫోన్ ట్యాపింగ్ కేస్ ఎప్పుడో అయిపోయింది.

హైదరాబాద్

రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్‌పై ఎమ్మెల్యేల కొనుగోలు కేసు నిందితుడు నంద కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు.2022 ఎమ్మెల్యేల కొనుగోలు కేసులు నందకుమార్ నిందితుడిగా ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో తన ఫోన్ కూడా ట్యాప్ అయ్యిందని.. ఈ విషయంపై అప్పటి డీజీపీ రవి గుప్తాకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డిని కలుద్దామని అనుకున్నానని.. కానీ అపాయింట్‌మెంట్ దొరకలేదని అన్నారు. ఈరోజు (బుధవారం) ఏబీఎన్ - ఆంధ్రజ్యోతితో నందకుమార్ మాట్లాడుతూ.. అప్పటి ఎస్ఐబి చీఫ్ ప్రభాకర్ రావు - మిగతా3లో



## బెంగుళూరు చిన్నస్వామి స్టేడియం వద్ద విషాదం

- తొక్కిసలాటలో 10మంది మృతి
- 18 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ ఆర్సీబీ.. ఐపీఎల్‌లో తొలి టైటిల్ సాధించిన సంగతి తెలిసిందే.

# రిజర్వేషన్ల తరువాతే ఎన్నికలు

- స్థానిక సంస్థల రిజర్వేషన్లను 42 శాతంకు పెంచిన తరువాతే ఎన్నికలు జరపాలి
- రాజకీయ పార్టీలు - ప్రతి పక్షాలు బి.సి.లకు మద్దతు ఇవ్వాలి.
- ఉద్యమాలకు సిద్దంగా యుండండి- కుల సంఘాలు పిలుపు
- ముఖ్యమంత్రి లేఖ రాసిన 14 కుల సంఘాలు



హైదరాబాద్

స్థానిక సంస్థలలో బి.సి రిజర్వేషన్లను 42 శాతంకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయాలని లేకపోతే పెద్ద యెత్తున ఆందోళన చేస్తామని ఊరు వాడ లో ఉద్యమం చేస్తామని రాజ్యసభ్యులు, జాతీయ బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య హెచ్చరించారు. ఒక వేళ పెంచకపోతే గ్రామ స్థాయి నుంచి ఉద్యమాలకు సిద్దంగా యుండాలని బి.సి ప్రజలకు పిలుపు నిచ్చారు. 42 శాతంకు పెంచిన తరువాతే ఎన్నికలు జరపాలని ఈ రోజు విద్యానగర్ బి.సి భవన్ లో 14 బి.సి సంఘాలు సమావేశమై ముఖ్యమంత్రికి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.వాస్తవంగా దాదాపు 12 నెలల క్రితం జరగవలసిన ఎన్నికలు బీసీ రిజర్వేషన్ గురించి వాయిదా మీద వాయిదా పడుతూ జాప్యం జరుగుతుంది. ప్రస్తుతం బీసీ రిజర్వేషన్ల విషయం పూర్తిగా పరిష్కారం కాలేదు. ఇది పరిష్కారం కాకుండా పెంచకుండా ఎన్నికలకు ఎలా వెళ్ళడం న్యాయం కాదు. ప్రతి పక్ష పార్టీలు బి.సి రిజర్వేషన్ల విషయంలో తమ వైఖరి ప్రకటించాలని కోరారు.బీసీ రిజర్వేషన్లను 20 శాతం నుంచి 42 శాతం అసెంబ్లీలో చట్టం చేశారు. కానీ దీని ప్రకారం ఇంతవరకు ప్రభుత్వ జిఓ జారీ కాలేదు. అసెంబ్లీ చట్టం చేసిన తర్వాత కేంద్రముకు పంపుతామని ప్రకటనలు వెలువడ్డాయి - మిగతా3లో



## అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- మంత్రి పొంగులేటి కీలక ప్రకటన
- వచ్చే నాలుగు సంవత్సరాల్లో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యం
- తమ ప్రభుత్వానికి చిత్తశుద్ధి, పేదవారి పట్ల ప్రేమ అభిమానాలు ఉన్నాయి
- ప్రజలకు ఉపయోగపడే మంచి పనిచేస్తే వారి నుంచి వచ్చే స్పందన గొప్పగా ఉంటుంది
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేక పోయినా సన్నబియ్యం ఇస్తున్నాం

ఖమ్మం

ఇందిరమ్మ ఇళ్లలో అర్హులందరికీ న్యాయం చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను మొదటి విడతలో భాగంగా అందజేస్తున్నామని ప్రకటించారు. ఇందిరమ్మ ఇళ్లను ఇస్తున్న తమ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు - మిగతా3లో

# అమెరికా వర్సెస్ చైనా

## మిక్కీ మౌస్ లలో నేతల వ్యవహారం



**న్యూఢిల్లీ :** చైనా ఆర్థిక, సాంకేతిక వ్యూహాలు అమెరికా ఆధిపత్యాన్ని సవాలు చేయడానికి ఉద్దేశించినవి. దక్షిణ చైనా సముద్రం, బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ వంటి చర్యలు ఈ లక్ష్యంలో భాగం. అయితే, అమెరికా ఆంక్షలు, ఇండో?పసిఫిక్ ఒప్పందాలు చైనాకు సవాళ్లుగా నిలిచాయి. చైనా ఆఫ్రికాలో వాణిజ్య ఆధిపత్యం సాధించినప్పటికీ, పూర్తి విజయం సాధించలేకపోయింది, త్రిశంకు స్వర్గంలా మధ్యలో నిలిచిపోయింది. బ్రిక్స్ దేశాలు డాలర్ ఆధిపత్యాన్ని తగ్గించేందుకు కొత్త కరెన్సీ లేదా చెల్లింపు విధానం కోసం చర్చించాయి. 2024లో రష్యా 'ది యూనిట్' అనే బంగారం ఆధారిత కరెన్సీని ప్రదర్శించినప్పటికీ, ఇది అమలులోకి రాలేదు. చైనా?ఇండియా విభేదాలు, ఏకీకృత బ్యాంకు లేకపోవడం వంటి సమస్యలు ఈ ప్రయత్నాన్ని అసాధ్యం చేశాయి. డాలర్ ఇప్పటికీ 58% గ్లోబల్ రిజర్వ్‌లలో ఆధిపత్యం చెలాయిస్తోంది.చైనా దక్షిణ చైనా సముద్రంలో 2016లో ఖఅం తీర్పును తిరస్కరించడం ద్వారా అం తర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించిందని విమర్శలు ఎదుర్కొంది. ఈ తీర్పు చైనా చర్యలను నియంత్రించలేకపోయింది, ఇది చైనా యొక్క 'సినోసెంట్రిక్' లక్ష్యాలను కొనసాగించేలా చేసింది. ఈ వైఫల్యం చైనా అంతర్జాతీయ చట్టపరమైన సవాళ్లను సూచిస్తుంది.చైనా యొక్క భౌగోళిక రాజకీయ లక్ష్యాలు అమెరికాతో పోటీ, బ్రిక్స్ కరెన్సీ, చట్టపరమైన సవాళ్లు పాక్షిక విజయాలు, పాక్షిక వైఫల్యాలతో త్రిశంకు స్వర్గంలా నిలిచిపోయాయి.

**ఇండో పసిఫిక్‌లో చైనా దూకుడు..**

తైవాన్‌ను చైనా తన భూభాగంలో భాగంగా పరిగణిస్తుంది. అయితే తైవాన్ తనను స్వతంత్ర దేశంగా చూస్తోంది. ఈ అంశం దశాబ్దాలుగా చైనా?తైవాన్ మధ్య, అలాగే చైనా?అమెరికా మధ్య ఉద్రిక్తతలకు కారణమైంది. పీట్ హెగ్సెత్ తన ప్రసంగంలో చైనా తైవాన్ చుట్టూ సముద్ర జలాల్లో యుద్ధ విమాన వాహక నౌకలను మోహరిస్తూ బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. ఇటీవలి సంవత్సరాల్లో, చైనా తైవాన్ సమీపంలో సైనిక విన్యాసాలు, యుద్ధ విమానాల రాకపోకలను పెంచింది. ఇది ఈ ప్రాంతంలో భద్రతా ఆందోళనలను పెంచింది. ఉదాహరణకు, 2024లో చైనా తైవాన్ సమీపంలో రికార్డు స్థాయిలో సైనిక విన్యాసాలు నిర్వహించినట్లు నివేదికలు సూచిస్తున్నాయి. చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్, తైవాన్ అంశం చైనా అంతర్గత వ్యవహారమని, ఇందులో విదేశీ దేశాల జోక్యం అనవసరమని స్పష్టం చేశారు. ఈ స్పందన చైనా "ఒకే చైనా" విధానాన్ని గట్టిగా నొక్కి చెబుతుంది, ఇది తైవాన్‌ను తమ భూభాగంగా చూసే వైఖరిని ప్రతిబింబిస్తుంది.ఇండో?పసిఫిక్ ప్రాంతంలో చైనా దూకుడు కేవలం తైవాన్‌కే పరిమితం కాదు. దక్షిణ చైనా సముద్రంలో చైనా ఏకపక్ష చర్యలు, ద్వీపాల నిర్మాణం, సైనికీకరణ వంటివి ఫిలిప్పీన్స్, వియత్నాం, మలేషియా వంటి దేశాలతో వివాదాలకు దారితీశాయి. హెగ్సెత్ తన ప్రసంగంలో ఈ భౌగోళిక వివాదాలను ప్రస్తావిస్తూ, చైనా ఈ ప్రాంతంలో ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తోందని విమర్శించారు. చైనా యొక్క "బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్" (ఃఖీఎ) ద్వారా ఆర్థిక, వాణిజ్య ఒత్తిళ్లను కూడా ఈ ప్రాంతంలోని దేశాలపై చైనా చేస్తోందని అంతర్జాతీయ విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదనంగా, హెగ్సెత్ పనామా కాలువపై చైనా ఆధిపత్య ప్రయత్నాలను ప్రస్తావించారు. చైనా లాటిన్ అమెరికాలో తన ప్రభావాన్ని పెంచుకోవడానికి పనామా కాలువను ఒక వ్యూహాత్మక సాధనంగా ఉపయోగించుకోవాలని చూస్తోందని ఆయన ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు చైనా యొక్క ఆర్థిక, సైనిక విస్తరణ వైఖరిని ఎదుర్కోవడానికి అమెరికా తీసుకుంటున్న చర్యలను సూచిస్తాయి.చైనా దూకుడును అడ్డుకోవడానికి అమెరికా ఇండో?పసిఫిక్ ప్రాంతంలో తన సైనిక, ఆర్థిక సామర్థ్యాలను బలోపేతం చేస్తోంది. హెగ్సెత్ తన ప్రసంగంలో ఈ ప్రాంతంలోని మిత్ర దేశాలైన జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, భారతదేశం వంటి దేశాలతో సహకారాన్ని పెంచడం, రక్షణ వ్యయాన్ని పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంలో, ఆసియా?పసిఫిక్ ప్రాంతంలో అమెరికా నాయకత్వంలో ఏర్పడిన సహకారం మరింత బలపడుతోంది. ఈ కూటమి చైనా యొక్క ఆధిపత్య ధోరణులను అడ్డుకోవడానికి కీలక పాత్ర పోషిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా తైవాన్‌కు ఆయుధాల సరఫరా, సైనిక శిక్షణను కొనసాగిస్తోంది, ఇది చైనాకు కోపం తెప్పిస్తోంది.చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్, అమెరికా తైవాన్‌కు ఆయుధాల సరఫరా, సైనిక సంబంధాలను నిలిపివేయాలని హెచ్చరించారు. "నిప్పుతో ఆడుకోవద్దు" అనే వ్యాఖ్య చైనా యొక్క గట్టి వైఖరిని, ఈ అంశంలో ఎట్టి రాజీ లేని స్థితిని సూచిస్తుంది. ఈ ఉద్రిక్తతలు భవిష్యత్తులో సైనిక ఘర్షణలకు దారితీసే అవకాశం ఉందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇండో?పసిఫిక్ ప్రాంతంలో అమెరికా?చైనా మధ్య ఈ ఉద్రిక్తతలు కేవలం రాజకీయ, సైనిక సమస్యలకే పరిమితం కాక, ఆర్థిక, వాణిజ్య రంగాలపై కూడా ప్రభావం చూపవచ్చు. చైనా ఆర్థిక ఒత్తిళ్లు, వాణిజ్య ఆంక్షలు ఈ ప్రాంతంలోని దేశాల ఆర్థిక స్థిరత్వాన్ని ప్రభావితం చేయవచ్చు. అదే సమయంలో, అమెరికా యొక్క సైనిక బలోపేతం, మిత్ర దేశాలతో సహకారం ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని కాపాడేందుకు కీలకం.

# 4,302కు చేరిన కొవిడ్ కేసులు..

# 24 గంటల్లో ఏడుగురు మృతి



**న్యూఢిల్లీ:** దేశంలో మరోసారి కొవిడ్ కేసుల సంఖ్య పెరుగుతోంది. కొవిడ్ యాక్టివ్ కేసుల సంఖ్య 4,302కు చేరినట్టు కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ తెలిపింది. గత 24 గంటల్లో ఏడుగురు మృతి చెందినట్టు సమాచారం. వీరిలో ముగ్గురు 22-27 ఏళ్ల మధ్యలో ఉన్నారని, వీరిలో శ్వాస సంబంధిత సమస్యలు, మధుమేహం వంటి సమస్యలు ఉన్నాయని చెబుతున్నారు. మహారాష్ట్రలో 4, తమిళనాడు, ఢిల్లీలో ఒక్కొక్కరు చొప్పున మరణించారు. కొవిడ్ యాక్టివ్ కేసుల్లో ముందున్న కేరళలో తాజాగా 43 కేసులు వెలుగుచూడటంతో మొత్తం కేసుల సంఖ్య 1,373కు చేరింది. పశ్చిమబెంగాల్‌లో కొత్తగా 60 కేసులు నమోదై 432కు చేరుకున్నాయి. ఢిల్లీలో కొత్తగా 64 కేసులు నమోదై 457కు చేరింది. గత కరోనా మహమ్మారి సమయంలో తీవ్ర ప్రభావం కనిపించిన మహారాష్ట్రలో కొత్తగా 16 యాక్టివ్ కేసులు నమోదు కావడంతో మొత్తం కేసుల సంఖ్య 510కి చేరింది. వ్యాధి లక్షణాలు కనిపించిన వారిలో సబ్‌వేరియంట్స్ ఎల్.7, ఎన్‌బీ.1.8.1లు వేరియంట్లుగా గుర్తించామని, అయితే ఇవి ఆందోళన కలిగించే వేరియంట్లా కాదా అనేది మానిటర్ చేస్తున్నామని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇటీవల తెలిపింది. కాగా, కొత్త సబ్ వేరియంట్లు వెలుగుచూస్తున్నప్పటికీ జేఎన్-1 వేరియంట్ ఎక్కువ మందిలో కనిపిస్తోందని, 53 శాతం పాజిటివ్ కేసుల్లో ఈ వేరియంట్ కనిపిస్తోందని అధికారులు చెబుతున్నారు. ఏప్రిల్‌లో తమిళనాడులో ఎన్‌బీ.1.8.1 వేరియంట్ కనిపించగా, ఈ నెల ప్రారంభంలో గుజరాత్‌లో నాలుగు కేసుల్లో ఎల్ఎఫ్.7 ఉన్నట్టు గుర్తించారు. ప్రజలు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, రద్దీ ప్రాంతాల్లో మాస్కులు ధరించాలని, శ్వాససంబంధిత ఇబ్బందులు, గొంతు సమస్యలు, జీర్ణాశయంలో ఇబ్బందులు ఉంటే సకాలంలో పరీక్షలు చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఆసుపత్రుల్లో మాక్ డ్రిల్స్ నిర్వహించాలని రాష్ట్రాలకు కేంద్ర సూచనలిస్తోంది.

# పాక్‌కు ఆసియా అభివృద్ధి బ్యాంక్ రుణసాయం



పాకిస్థాన్‌కు ఆసియా అభివృద్ధి బ్యాంక్ 800 మిలియన్ డాలర్ల రుణం మంజూరు చేయడాన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. పాక్ సైనిక వ్యయం కోసం నిధులు దుర్వినియోగం చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేసింది. జూన్ 3న ఈ ప్యాకేజీకి ఆమోదం లభించింది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకార చర్యగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' తో గట్టిగా బదులు తీర్చుకుంది. ఆ నేపథ్యంలో రెండుదేశాల మధ్య యుద్ధవాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. తరుణంలో పాకిస్థాన్‌కు రుణం ఇవ్వకూడదని భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి 1 బిలియన్ డాలర్ల నిధులు (దాదాపు రూ.8,540 కోట్లు) మంజూరయ్యాయి. ఎక్స్‌టెండెడ్ ఫండ్ ఫెసిలిటీ కింద ఈ మొత్తాన్ని ఇవ్వడానికి ఐఎంఎఫ్ ఆమోదం తెలిపింది. పాక్‌కు నిధులు మంజూరు చేస్తే పరోక్షంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహించినట్లే అవుతుందని.. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఐఎంఎఫ్ పాక్‌కు నిధులు సమకూర్చడంపై పునరాలోచిం చాలని భారత ప్రభుత్వం కోరిన సంగతి తెలిసిందే.

## బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వద్ద విషాదం



బెంగళూరు: రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయోత్సవ కార్యక్రమం సందర్భంగా పెను విషాదం చోటు చేసుకుంది. 18 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ ఆర్సీబీ.. ఐపీఎల్‌లో తొలి టైటిల్ సాధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ జట్టుకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో స్టేడియం వద్దకు వేలాదిగా అభిమానులు తరలివచ్చారు. స్టేడియం గేట్లు, సమీపంలోని గోడలు, చెట్లు ఎక్కారు. గేట్-2 నుంచి స్టేడియంలోకి వెళ్లేందుకు ఒక్కసారిగా దూసుకెళ్లారు. అభిమానులను అదుపు చేసేందుకు పోలీసులు లాఠీఛార్జి చేయాల్సి వచ్చింది. దీంతో ఒక్కసారిగా తోపులాట జరిగింది. ఈ ఘటనలో 10 మంది మృతి చెందగా, 50 మందికిపైగా గాయపడ్డారు. క్షతగాత్రులను సమీపంలోని వివిధ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల్లో ఆరుగురు పురుషులు, నలుగురు మహిళలు ఉన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్.. ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. తొక్కిసలాట ఘటనతో ఆర్సీబీ క్రీడాకారులకు సన్మాన కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. చిన్నస్వామి స్టేడియంవైపు వెళ్లే మెట్రో, ఇతర వాహనాలను నిలిపివేశారు.

**బెంగళూరు విమానాశ్రయంలో ఘనస్వాగతం..**

ఎన్నో పరాభవాల తర్వాత ఆర్సీబీ కల నెరవేరడంతో దేశవ్యాప్తంగా బెంగళూరు టీమ్ అభిమానులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటున్నారు. ఆర్సీబీ టీమ్ ట్రోఫీతో తొలిసారి బెంగళూరుకు రాగా.. ఫ్యాన్స్ ఘన స్వాగతం పలికారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ విమానాశ్రయానికి వెళ్లి ఆర్సీబీ జట్టుకు స్వాగతం పలికారు. విరాట్ కోహ్లీ, కృనాల్ పాండ్య, టిమ్ డేవిడ్, దినేశ్ కార్తిక్‌లకు ఆయన పుష్పగుచ్ఛం అందించి వెల్‌కమ్ చెప్పారు. అనంతరం బెంగళూరు జట్టు ప్రత్యేక బస్సులో విధాన సౌధకు చేరుకుంది. ఈ క్రమంలో వేలాది అభిమానులు ఆర్సీబీ జెండాలు చేతబూని విధాన సౌధ వద్దకు చేరుకున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా 'ఎర్రసముద్రాన్ని' తలపించింది. ఆర్సీబీ ఆటగాళ్లు బస్సులో వస్తున్న మార్గంలోనూ అభిమానులు సందడి చేశారు.

## కుల గణనపై కేంద్రం కీలక నిర్ణయం



**న్యూఢిల్లీ:** జనాభా లెక్కలకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ లెక్కలు దేశాభివృద్ధికి పలు విధాలుగా దోహదపడనున్నాయి. తదుపరి దేశ జనాభా గణన 2027, మార్చి ఒకటి నుంచి ప్రారంభం కానున్నదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. దీనిలో కుల గణనతో పాటు కీలకమైన సామాజిక, ఆర్థిక వివరాలను సేకరించనున్నారు. ఈ జనాభా గణన 2026 అక్టోబర్ నుంచే లడఖ్, జమ్ముకశ్మీర్ హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ తదితర ప్రాంతాలలో ప్రారంభం కానుంది. జనగణనను రెండు దశల్లో నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న పురుషులు, మహిళల గణాంకాలతో పాటు, వారి కులం, ఉపకులాలపై ప్రభుత్వం సమాచారం సేకరించనుంది. కులాల వారీగా జనాభా గణన చేయడం వలన ఎవరెవరికి వాస్తవంగా సరైన అవకాశాలు లభిస్తున్నాయో, ఎవరు ఇంకా వెనుకబడి ఉన్నారో లాంటి విషయాలు వెల్లడి కానున్నాయి. విద్య, ఉపాధి, ఆరోగ్యం, ప్రభుత్వ సహాయాలు తదితర అంశాల్లో సమానత్వాన్ని తీసుకొచ్చేందుకు ఇది ఎంతో కీలకంగా మారనుంది. దీని ఆధారంగానే ప్రభుత్వం విధానాలను రూపొందించాల్సి ఉంటుంది. కుల గణనకు పలు రాజకీయ పార్టీలు మద్దతునిస్తున్నాయి. దేశంలో చివరిసారి అధికారికంగా కులాల వారీగా జనాభా గణన 1931లో చేపట్టారు. ఆ తర్వాత 1941లో మళ్లీ చేయాలనుకున్నా, రెండో ప్రపంచ యుద్ధం కారణంగా కుల గణన నిర్వహించలేకపోయారు. దీంతో నాటి గణనలే ఇప్పటికీ రిఫరెన్స్ పాయింట్‌గా కొనసాగుతున్నాయి. కాంగ్రెస్ హయాంలో 2011లో కుల గణన జరిగింది. అయితే ఇది పూర్తి వివరాలతో బయటకు రాలేదు. 1948 జనాభా చట్టం ప్రకారం వ్యక్తిగత వివరాలు గోప్యంగా ఉంచాలి. ఈ కారణంగానే నాటి గణాంకాలపై స్పష్టత రాలేదు.

## జులై 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు


**న్యూఢిల్లీ :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తేదీలు ఖరారయ్యాయి. జులై 21వ తేదీ నుంచి ఆగష్టు 12వ తేదీ దాకా సెషన్ ఉంటుందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు బుధవారం ప్రకటించారు. ఆపరేషన్ సింధూర్ నేపథ్యంతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ఇండియా కూటమి డిమాండ్ చేస్తున్న వేళ.. వర్షాకాల సమావేశాల తేదీలను కేంద్రం ప్రకటించడం గమనార్హం. ఈ ఏడాది పార్లమెంట్ తొలి సమావేశం.. జనవరి 31వ తేదీన బడ్జెట్ సెషన్‌తో ప్రారంభమైంది. కాస్త విరామంతో రెండు దఫాలుగా బడ్జెట్ సమావేశాలు జరిగాయి. ఏప్రిల్ 4వ తేదీన లోక్‌సభ, రాజ్యసభల నిరవధిక వాయిదాతో ఈ ఏడాది పార్లమెంట్‌కు తొలి సమావేశాలు(బడ్జెట్) జరిగాయి.

## కుప్పకూలిన మూడంతస్తుల భవనం

**న్యూఢిల్లీ, జూన్ 04:** దేశ రాజధాని న్యూఢిల్లీలోని రోహిణి సెక్టర్ 7లో మూడంతస్తుల భవనం బుధవారం కుప్పకూలింది. ఈ ఘటనలో పలువురు వ్యక్తులు భవనం కింద శిథిలాల్లో చిక్కుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై సమాచారం అందగానే ఎన్డీఆర్ఎఫ్, పోలీసులు, నగర పాలక సంస్థ సిబ్బంది హుటిహుటిన ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ సహాయక చర్యలు కొనసాగుతోన్నాయి. ఈ భవనం కుప్పకూలిన ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఈ ఘటనపై సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ పరాస్ మాట్లాడుతూ.. శిథిలాల కింద చాలా మంది చిక్కుకుని ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ రోజు సాయంత్రం 4.00 గంటలకు అగ్నిమాపక సిబ్బందికి ఈ భవనం కూలినట్లు సమాచారం అందిందని.. దీంతో వారంతా ఘటన స్థలానికి కొన్ని నిమిషాల వ్యవధిలోనే చేరుకున్నారని ఉన్నతాధికారులు వివరించారు.

http://www.agnidharanews.com
అగ్నిధార
నిజాల నిప్పు కణిక

# అసలు సిసలైన ప్రజాస్వామికవాది



భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక జరిగిన మొట్టమొదటి లోక్‌సభ (1951–52) ఎన్నికల్లో జాతీయ కాంగ్రెస్ అగ్రనేత జవహర్‌లాల్ నెహ్రూను మించిన మెజార్టీతో గెలుపొందిన వ్యక్తి ఒక తెలుగు వారు అనే విషయం చాలా మందికి తెలియదు. అంతేకాదు, దేశంలోనే ఆ ఎన్నికల్లో అత్యధిక ఓట్లు పొందిన లోక్‌సభ అభ్యర్థిగా కూడా రికార్డు సృష్టించింది ఆ తెలుగు వ్యక్తే. ఆయనే తెలంగాణ సాయుధ పోరాట యోధుడుగా ప్రసిద్ధులైన రావినారాయణ రెడ్డి. హైదరాబాద్ రాష్ట్రంలోని నల్గొండ నియోజకవర్గం నుంచి పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) పార్టీ తరపున నారాయణ రెడ్డి పోటీ చేసి ఆ ఘనతను సాధించారు. నాడు హైదరాబాద్ రాష్ట్రంలో 17 ఏక సభ్య నియోజక వర్గాలు, నాలుగు ద్విసభ్య నియోజక వర్గాలు ఉండే వి. ద్విసభ్య నియోజక వర్గాలకు ఇద్దరు చొప్పున సభ్యులు ప్రాతిని ధ్యం వహించే పద్ధతి ఉండేది. నల్గొండ కూడా అప్పుడు ద్విసభ్య నియోజవర్గం గానే ఉండేది. అక్కడ రావినారాయణ రెడ్డితో పాటు పోటీ చేసిన, సుకం అచ్చాలు విజయం సాధించగా, ఇద్దరూ పీడీఎఫ్ అభ్యర్థులే కావడం విశేషం. 1952 మార్చి 27 పోలింగ్ జరగగా... రావి నారాయణ రెడ్డికి 3,09,162 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి పీ.భాస్కర్ రావు పై 2,22,280 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అలాగే ఉత్తర ప్రదేశ్ లోని అలహాబాద్ కమ్‌జౌన్‌పూర్ (పశ్చిమ) ద్విసభ్య నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన జవహర్ లాల్ నెహ్రూకు 2,33,571 ఓట్లు రావడం జరిగింది. తొలి లోక్‌సభ ఎన్నికల్లో దేశంలోనే అత్యధిక ఓట్లు పొందిన ఎంపీతో పార్లమెంట్ భవనాన్ని ప్రారంభిం చాలని ఆ సందర్భంలో నిర్ణయిం చారు. నెహ్రూజీ కన్నా అధిక ఓట్లు సాధించిన రావి నారాయణరెడ్డి చేతుల మీదుగా ఢిల్లీలోని పార్లమెంట్ భవనం ప్రారంభమైంది. ఇది తెలుగు వారికి గర్వకారణమై మరచి పోలేని సంఘటనగా మిగిలి పోయింది. ఆ ఎన్నికలలో భువన గిరి శాసనసభ స్థానం నుంచి కూడా నారాయణ రెడ్డి పోటీ చేసి విజయం సాధించడం మరో విశేషం. అయితే రావి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఎంపీగా కొన సాగారు. రావి నారాయణరెడ్డి, (జూన్ 5, 1908 – సెప్టెంబర్ 7, 1991) కమ్యూనిస్టు నాయకులు, తెలంగాణ పోరాటంలో ముఖ్యులు. ఆయన సంఘ సంస్కర్త. ఆంధ్ర మహాసభ ప్రారంభించిన సాంస్కృతి కోద్యమాన్ని క్రమంగా వామపక్ష సాయుధ పోరాటంగా పరివర్తన చేసిన గొప్ప నాయకులు. తెలంగాణ సాయుధ పోరాటానికి ఆద్యునిగా కూడా ఆయనను పేర్కొంటారు. రావి... యాదాద్రి – భువనగిరి జిల్లా భువనగిరి మండలం బొల్లేపల్లిలో 1908, జూన్ 5న భూస్వామ్య కుటుంబంలో జన్మించారు. రెడ్డి హాస్టల్ విద్యార్థిగా ఉండగానే అప్పటి నిజాం కళాశాల విద్యార్థి అయిన బద్దం ఎల్లారెడ్డితో కలసి 1930 సంవత్సరంలో దేశవ్యాప్తంగా జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో కాకినాడ వెళ్లి పాల్గొన్నారు. 1931లో హరిజన సేవాసంఘాన్ని నెలకొల్పి దాని ప్రధాన కార్యదర్శి హోదాలో హైదరాబాద్ రాష్ట్ర వ్యాప్తంగా 100 పాఠశాలలు ప్రారంభించారు. రెండు వసతి గృహాలను నిర్వహించారు. 1930లో బ్రిటిష్ మహాత్మా గాంధీ అరెస్టుకు నిరసనగా హైదరాబాద్ లోని హస్మద్ గంజ్‌లో బహిరంగ సభలో బ్రిటిష్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యల్ని తీవ్రంగా ఖండిస్తూ మాట్లాడారు. 1931లో దేవర కొండలో జరిగిన రెండవ ఆంధ్ర మహాసభలకు తన తోటి విద్యార్థులను పోగుచేసి హైదరా బాద్ నుంచి పాదయాత్రగా వెళ్ళారు. నిజామాంధ్ర మహాసభ లోని భాగస్వామ్య పక్షాలైన కాంగ్రెస్, ఆర్యసమాజ్, హిందూ మహాసభలతో కలిసి పనిచేసిన కమ్యూనిస్టుగా ఆయన ఆచరణ విశిష్టమైనది. సిద్ధాంత పరంగా విభేదించే శక్తులతో ఐక్య సంఘటన ఏర్పరచి ఏకతాటిపై ఉద్యమాన్ని ఎలా నిర్మించవచ్చో తన ఆచరణ ద్వారా నిరూపించిన ప్రజాస్వామిక వాది రావి. 1938లో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్‌ను స్థాపించిన వారిలో రావి ముఖ్యులు. నిజాం ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీపై విధించిన నిషేధం ఎత్తేయాలని అక్టోబరు 24న తొలిబ్యాచ్ సభ్యులుగా సత్యాగ్రహం చేశారు. ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ నియంతృ త్వ పాలనకు వ్యతిరేకంగా తలెత్తిన ప్రజా పోరాటానికి మార్గ నిర్దేశం చేసిన జననేత ఆయన. తెలంగాణ విమోచన తరువాత ఆయన సిపిఐ లో చాలాకాలం పనిచేశారు. రావి నారాయణరెడ్డి విశాలాంధ్ర కోసం చేసిన శ్రమ అనిర్వచనీయం. నిజాం ప్రభుత్వం మీద ఆయన చేసిన సాయుధ పోరాటం చిరస్మరణీయం. 1946–48 కాలంలో హైదరాబాదు సంస్థానంలో నిజాం పోలీసుల దాష్టీకాన్ని, మత దురహంకారులైన రజాకార్ల ఆగడాలనూ అరికట్టడ్డ దానికి అజ్ఞాతంగా ఎన్నో గెరిల్లా దళాలను ఏర్పాటు చేసారు. 1941లో నల్లగొండ జిల్లా చిలుకూరులో జరిగిన 8వ నిజామాంధ్ర మహాసభకు, 1944లో భువనగిరి లో జరిగిన మహాసభకు ఆయనే అధ్యక్షత వహించారు. వితంతు వివాహాలు, అక్షరాస్యతా కార్యక్రమా లను నిర్వహిస్తూనే ఆంధ్ర మహా సభను క్రియాశీల రాజకీయ సంస్థగా మలిచారు. భువనగిరి సమావేశాల్లోనే ఆంధ్ర మహాసభ అతివాద, మితవాద శిబిరాలుగా చీలి పోయింది. మహాత్మాగాంధీ హైదరాబాద్‌కు వచ్చినప్పుడు తన భార్య సీతాదేవితో వెళ్ళి కలిసి తన భార్య ఒంటిపై ఉన్న నగలన్నింటినీ తీసి గాంధీ చేతిలో పెట్టి, హరిజన సేవక సంఘానికి ఇవ్వమని గాంధీజీని అభ్యర్థించిన దేశభక్తులు రావి. దేశ స్వాతంత్ర్యానికి ముందు సాగిన సాయుధ పోరాటాన్ని వ్యూహాత్మకంగా సమర్థించిన రావి, 1947 తరువాతి కాలంలో పోరాటాన్ని కొనసాగించాలనే 'మెజారిటీ' నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. తాను ఎన్నటికీ వీర తెలంగాణ వాదిగానే ఉంటానని చాటి చెప్పారు. గాంధేయవాది అయిన రావి తనకు సంక్రమించిన భూమిలో 20 ఎకరాలను మాత్రమే ఉంచుకుని 500 ఎకరాలను రైతు కూలీలకు పంచిపెట్టారు. తాను మరణిస్తే తన భార్య వైధవ్య ప్రతీకలను ఆమోదించ రాదని, కట్టూబొట్టులతో సలక్షణంగా ఉండాలని, ఆమె తన అభీష్టాను సారం జీవించవచ్చునీ, అలాగే తన అస్థికలను గంగా నదిలో కలప వద్దని, పొలంలో చల్లితే చాలనీ వీలునామా రాసిన సామాజిక సంస్కర్త రావి, 1991, సెప్టెంబర్ 7 న తుదిశ్వాస విడిచారు.

# పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత



1972 లో యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ ద్వారా ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఏర్పాటు చేయబడింది. 1972 జూన్ 5 వ తేది నుంచి 16 వ తేది వరకు మానవ పర్యావరణంపై ఐక్యరాజ్యసమితి సమావేశం అయింది. పర్యావరణ పరిరక్షణ సదస్సు లో వాతావరణ మార్పులను గమనిస్తూ తగు చర్యలు చేపట్టాల్సిన అవసరముందని గుర్తించారు. 1973 లో మొదటిసారి ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకున్నారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఈ సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ ప్రపంచ పర్యావరణ దినోత్సవమును జూన్ 5 తేదిన వేర్వేరు నగరాలలో విభిన్న రీతులలో అంతర్జాతీయ వైభవంగా జరుపుకుంటున్నారు. పర్యావరణాన్ని రక్షించటానికి ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాలు, వివిధ రకాలైన కాలుష్యాలను నియంత్రించటానికి, అదే విధంగా కాలుష్య దుష్ప్రభావాలను తగ్గించటానికి పర్యావరణ పరిరక్షణకు వివిధ చట్టాలను అమలు చేస్తున్నాయి. అదే విధంగా మన దేశంలో కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కాలుష్య నివారణ చర్యలకై పలు చట్టాలను రూపొందించి అమలు జరుపుతున్నది. అనాలోచిత మానవ చర్యల వల్ల కలుగుతున్న ప్రకృతి విధ్వంసాన్ని నిలువరించాలన్న బృహత్తర లక్ష్యంతో పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్నాం. ప్రకృతి నియమాలకు విరుద్ధంగా మనిషి చేస్తున్న పనుల వల్ల భూగోళం అ మితంగా వేడెక్కిపోతోంది. శిలాజ ఇంధనాలను విచ్చలవిడిగా వాడడం వల్ల వాయుకాలుష్యం పెచ్చు మీరుతోంది. పట్టణాలు, నగరాల నుంచి వెలువడుతున్న వ్యర్థాలతో పర్యావరణ కాలుష్యం పెరిగిపోతోంది. వ్యవసాయంలో రసాయనాలు విచ్చలవిడిగా వాడుతూ పదికాలాల పాటు పది లంగా చూసుకోవాల్సిన భూమిని నిస్సారంగా మార్చుతున్నాం. తరిగిపోయే వనరులకు బదులు, తరగని, పునర్వినియోగించుకోగల వనరుల ఆధారంగా జరిగే అభివృద్ధే సుస్థిరాభివృద్ధి. ఇదే ధరిత్రికి సుస్థిర భవిష్యత్తును చేకూరుస్తుంది. సమస్త జీవకోటి భారాన్ని మోసేది భూమి. పంచభూతాలలో ఒకటిగా, భారతీయ సంస్కృతిలో భూమి భూదేవతగా భావించబడి, పూజింప బడడం కనిపిస్తుంది. భూమి పరిరక్షణ కోసం ప్రత్యేకంగా చర్యలు తీసుకోకపో యినా, కనీసం హాని కలిగించకుండా ఉంటే చాలు. ఇందుకోసం అవగాహన అవసరం. అటు పర్యావరణం, వాతావరణంతో పాటు ఇటు జీవన శైలిలోనూ మార్పులతో భూ పరిరక్షణపై అవగాహన కోసం కూడా ప్రత్యేక కార్యక్రమాలు అవసరమవుతున్నాయి. వ్యవసాయం కోసం విచ్చలవిడిగా వాడుతున్న రసాయనాలు భూమిని నిస్సారంగా, నిర్జీవంగా మార్చేస్తున్నాయి. జీవం కోల్పోయిన నేలలో దిగుబడులూ నాసిగానే ఉంటాయి. దీర్ఘకాలంలో దిగుబడులు మరీ తగ్గిపోయి ఆహార సంక్షోభాలకు దారితీసే ముప్పు పొంచి ఉందని ఐక్యరాజ్యసమితి ప్రత్యేక ప్రతినిధి ఆలివర్ డి షుట్టర్ గుర్తించారు. పర్యావరణ అనుకూల వ్యవసాయ విధానాల వైపు మళ్లడం తప్ప మరో మార్గం లేదని నివేదించారు. వ్యవసాయంలో రసాయనాలు వాడే విధానాలను ప్రపంచ వ్యాప్తం చేయడంలో కీలకపాత్ర వహించింది అమెరికా. ధరిత్రి దినోత్సవం పేరిట పర్యావరణ పరిరక్షణ ఉద్యమం కూడా అమెరికాలోనే ప్రారంభం కావడం విశేషం. 50 ఏళ్ల క్రితం ఏప్రిల్ 22న గేలార్డ్ నెల్సన్ నేతృత్వంలో కాలుష్యకారక విధానాలకు నిరసనగా జనం ఉవ్వెత్తున ఉద్యమించారు. భారత ప్రభుత్వం 1981వ సంవత్సరంలో "వాయుకాలుష్య చట్టాన్ని ప్రవేశపెట్టింది. 1986వ సంవత్సరంలో "పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని కూడా అమలులోకి తెచ్చింది. మొత్తం పరిశ్రమలను కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నాలుగు తరగతులుగా విభజించింది. ఆయా పరిశ్రమల నుండి వెలువడే కాలుష్య కారకాలను అనుసరించి అత్యధిక కాలుష్యాన్ని వెదజల్లే వాటిని ఎరుపు వర్గంగాను, మధ్యస్తంగా కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలను నారింజ వర్గంగాను, తక్కువ కాలుష్యాన్ని వెదజల్లే వాటిని ఆకుపచ్చ వర్గంగా, కాలుష్యానికి ఆస్కారమివ్వని వాటిని తెలుపువర్గంగా వర్గీకరించింది. పరిశ్రమల నుంచి వెలువడే పొగ, బూడిద, విషవాయువులు వంటి వాటిని ఫిల్టర్లతో వడపోసి మాత్రమే వాతావరణంలోకి వదలాలి. ఇటువంటి పరిశ్రమలను, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, అణురియాక్టర్ల వంటి వాటిని జనుల నివాసాలకు దూరంగా కట్టాలి. రైళ్ళు, వాహనాలు వంటి వాటికి ఉపయోగించే పెట్రోలు, డీజిల్ వంటి ఇంధనాలు కాకుండా జీవ ఇంధనాలు వాడేలా చూడాలి. దీనివలన ఎంతో వాయు కాలుష్యం తగ్గుతుంది. భూమి, నీరు వంటి మౌలిక వనరులను గరిష్ట సామర్థ్యంతో వినియోగించాలి. వినియోగ అనుకూల సామర్థ్యాన్ని పెంచాలి. దూరదృష్టితో తరగని, పునర్వినియోగించు కోగల వనరుల వినియోగాన్ని ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలి. ప్రధానంగా సౌరశక్తి వినియోగం అధికంగా జరగాలి. గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలను కనీస స్థాయికి తగ్గించ గలగాలి. అడువుల సంరక్షణ, పెంపకం, సుస్థిర యాజమాన్య పద్ధతులు, జీవవైవిధ్య సంరక్షణ జరగాలి. తెలంగాణలోని పరిశ్రమలన్నింటినీ కాలుష్య నియంత్రణ మండలి క్రమబద్ధంగా పర్యవేక్షిస్తోంది. ఈ పరిశ్రమలు ఎటువంటి కాలుష్యాన్ని విడుదల చేయకుండా చూస్తూ, ఒక వేళ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలకు ఉపక్రమిస్తున్నది. అలాగే అడవులను, పర్యావరణాన్ని రక్షించేందుకు ఇతర చర్యలతో పాటు, అతి ముఖ్యమైన తెలంగాణకు హరితహారం అనే బృహత్తర కార్యక్రమాన్ని రూపొందించి గత కొన్ని సంవత్సరాలుగా యుద్ధ ప్రాతిపదికపై కోట్లాది మొక్కలు నాటి పర్యావరణ సంరక్షణకు కృషి చేస్తున్నది. ప్రభుత్వాలు ఏదో చేయాలని మిన్నకుండి పోకుండా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలి.

## ప్రవర్తన మర్యాదగా ఉండాలి

ఆసుపత్రిలో పారిశుధ్య పనులు మెరుగ్గా ఉండాలి.

ఆసుపత్రి సిబ్బంది హాజరు బయోమెట్రిక్ ద్వారా పర్యవేక్షించాలి.

ఆసుపత్రి అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

మంథని ఆసుపత్రి పని తీరు పై సమీక్ష.

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**అగ్నిధారన్యూస్,పెద్దపల్లి, జూన్ –04:** ఆరోగ్య సమస్యలతో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులు వారి సహాయకులతో మన సిబ్బంది ప్రవర్తన మర్యాదగా ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మంథని ఆసుపత్రి పని తీరు పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, మంథని ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ ఆశించిన స్థాయిలో ఉండటం లేదని కలెక్టర్ తెలిపారు. మాతా శిశు ఆసుపత్రి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు పారిశుధ్య నిర్వహణ మెరుగు పర్చాలని లేని పక్షంలో. పారిశుధ్య కాంట్రాక్టర్ చెల్లింపులు నిలిపి వేయడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆసుపత్రి వచ్చే రోగులతో సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలని, ప్రజల తో సిబ్బంది చాలా దురుసుగా మాట్లాడుతున్నట్లు సమాచారం అందుతుందని, పని తీరు మార్చుకొని పక్షంలో వేటు వేయడం జరుగుతుందని అన్నారు. ఆసుపత్రి విధులకు డాక్టర్లు సకాలంలో విధులకు హాజరు కావాలని అన్నారు. బయో మెట్రిక్ అటెండెన్స్ విధానం అమలు చేయాలని, రెగ్యులర్ గా వైద్యుల హాజరు వివరాల నివేదికను సమర్పించాలని అన్నారు. మంథని ఆసుపత్రి వచ్చే ఔట్ పేషెంట్ సంఖ్య పెరగాలని అన్నారు. మాతా శిశు ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని, చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలో విశ్వాసం కల్పించేలా మనం పని చేయాలని కలెక్టర్ సూచించారు. మంథని పట్టణంలో 26 కోట్లతో చేపట్టిన 50 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలని, ఆసుపత్రి అవసరమైన భూమి వైద్య శాఖకు బదలాయింపు పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. పెద్దపల్లి పట్టణంలో 100 పడకల ఆసుపత్రి పనులు వర్షా కాలం లోపు ఒక బ్లాక్ పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో డి సి హెచ్ ఓ. శ్రీధర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ పనులను త్వరగా గ్రౌండింగ్ చేయాలి

**అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి ఆదేశం**



**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా:** జిల్లాలో జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన మెటీరియల్ కాంపోనెంట్ పనులను త్వరగా గ్రౌండింగ్ చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం ఐడిఓసి సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇంచార్జ్ యాదయ్య తో కలిసి ఉపాధి హామీ పథకము మెటీరియల్ కాంపోనెంట్ పనులపై సమీక్ష నిర్వహించారు. మెటీరియల్ కాంపోనెంట్ కింద వనపర్తి జిల్లాకు 23 నూతన గ్రామపంచాయతీ భవనాలు, 11 కమ్యూనిటీ మరుగుదొడ్లు ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్లు రెండు, సిగ్రిగేషన్ షెడ్లు, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, స్వచ్ఛభారత్ కోష్ మంజూరు అయి ఉన్నాయని, వీటిని గ్రౌండింగ్ చేసేందుకు గ్రామ పంచాయతీలకు కేటాయించి స్థలం సేకరించే కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. స్థలం నిర్ధారించాక పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ లను ఆదేశించారు.

**వన మహోత్సవం**

వర్షాలు ప్రారంభం అయినందున ఈ సంవత్సరం హరితహారం లో భాగంగా మొక్కలు నాటి కార్యక్రమంలో దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీ ప్రధాన రహదారికి వచ్చి పోయే దారిలో 200 మొక్కల చొప్పున అందమైన మొక్కలు నాటేందుకు కార్యాచరణ ప్రారంభించాలని సూచించారు.

గ్రామంలో ఎక్కడెక్కడ మొక్కలు నాటేందుకు అవకాశాలు ఉన్నాయో సైట్ లు గుర్తించి పెట్టుకోవాలని ఆదేశించారు. ఈ సంవత్సరము జిల్లాలో 44 కొత్త నర్సరీలు ప్రారంభించేందుకు లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని వాటిని వెంటనే ప్రారంభించేందుకు ఆయా గ్రామ పంచాయతీల్లో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**ఇందిరమ్మ ఇళ్లు**

ప్రతి మండలంలో ఒక గ్రామ పంచాయతీనీపైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని మొదటి విడతలో మంజూరు అయిన ఇందిరమ్మ ఇళ్లు త్వరగా గ్రౌండింగ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ లను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లకు డబ్బులు సైతం వెనువెంటనే ఖాతాలో జమచేయడం జరుగుతుందని, లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. అవసరం అయితే లబ్ధిదారులకు మండలంలో నిర్మించిన మోడల్ ఇందిరమ్మ ఇంటిని చూపించాలని సూచించారు.

నేటి ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి ప్రపంచ పర్యవ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నేడు అన్ని మండలాలు మున్సిపాలిటీలో పర్యావరణ దినోత్సవం నిర్వహించాలని ఆదేశించారు. ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టడం, పరిసరాల పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అదనం కలెక్టర్ లోకల్ బాడీస్ ఇంచార్జ్ యాదయ్య పంచాయతి రాజ్ కార్యనిర్వాహక ఇంజనీరు మల్లయ్య ఎంపీడీవోలు ఎంపిఓలు, తదితరులు పాల్గొన్నారు.

## బాలికపై లైంగిక దాడి ఇద్దరిపై పోక్సో కేసు నమోదు

**సైదాబాద్ :** అన్నా, అంకుల్ అని తమను ఆప్యాయంగా పిలిచే బాలికపై ఇద్దరు అమానుషంగా వ్యవహరించారు. వేర్వేరు సందర్భాలలో ఆ బాలిక నిస్సహాయతను అవకాశంగా తీసుకొని ఇద్దరు లైంగిక దాడికి ఒడిగట్టారు. దళిత మైనర్ బాలికపై దాష్టీకానికి పాల్పడిన ఇద్దరిపై సైదాబాద్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసించే బాలిక (16) ఇటీవల పదవ తరగతి పూర్తి చేసింది. తనను ఆటోలో స్కూల్కు తీసుకెళ్లే వ్యక్తిని బాలిక అంకుల్ అని పిలిచేది. అదే వ్యక్తి మాయమాటలతో బాలికను లోబరుచుకొని తన నివాసంలో పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. మరో సందర్భంలో బాలిక నివాసానికి సమీపంలో ఉండే ఓ యువకుడు టీవీ చూడటానికి తమ ఇంటికి వచ్చిన బాలికను లోబర్చుకుని లైంగిక దాడి చేశాడు. కొద్ది రోజులకు బాలిక ఈ విషయాన్ని తండ్రి, ఇతర బంధువులకు తెలియజేయడంతో సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలికను భరోసా కేంద్రానికి తరలించిన పోలీసులు..నిందితులు ఇద్దరినీ అదుపులోకి తీసుకొని విచారణ అనంతరం జైలు కు రిమైండ్ కి తరలించారు...

# పెబ్బేరులో రేషన్ షాపు ఆకస్మిక తనిఖీ

**అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. వెంకటేశ్వర్లు.**



**అగ్నిధార న్యూస్ పెబ్బేర్, వనపర్తి జిల్లా:** పెబ్బేర్ మున్సిపల్ కేంద్రంలోని రేషన్ షాపు (2)ను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి.వెంకటేశ్వర్లు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ప్రజలకు రేషన్ సరుకుల పంపిణీ తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మొదటగా రేషన్ షాపు సమయానికి తెరుస్తున్నారా లేదా అని పరిశీలించారు. అనంతరం మూడు నెలలకు సరిపడా బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తున్నారా లేదా అని డీలర్ రాణి ని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, పంపిణీ అవుతున్న సన్న బియ్యం నాణ్యత ఎలా ఉంది అని అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా లబ్ధిదారులకు ఇచ్చిన బియ్యం సరైన తూకంతో ఉన్నాయో లేదో అని తనిఖీ చేయడానికి కొంతమంది అందుకున్న బియ్యం ప్యాకెట్లను స్వయంగా తూకం వేసి సరిచూశారు. బియ్యం నాణ్యతను, డీలర్ వద్ద ఉన్న తూకాలను కూడా వ్యక్తిగతంగా పరిశీలించారు. అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజలకు రేషన్ సరుకులు నాణ్యతగా, సక్రమంగా, సరైన తూకంతో అందేలా చూడటం ప్రభుత్వ బాధ్యత అని, ఇందులో ఎలాంటి లోపాలున్నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సన్న బియ్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ బయటి వ్యక్తులకు విక్రయించరాదని డీలర్లను స్పష్టం చేశారు. రేషన్ షాపు డీలర్లు అన్ని రికార్డులను తప్పనిసరిగా సక్రమంగా నిర్వహించాలని, నిబంధనలను పక్కాగా పాటించాలని, లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో, సకాలంలో సేవలు అందించాలని సూచించారు. ఈ ఆకస్మిక తనిఖీ ప్రజలకు మెరుగైన సేవలందించడంలో భాగంగా జరుగుతుందని ఆయన తెలిపారు.

## రైతు భరోసా వెంటనే వేయాలి

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** రాష్ట్ర ప్రభుత్వం కొంతమందికి మాత్రమే రైతు భరోసా వేసి చాలామంది రైతులకు మొండి చేయి చూపిందని పెండింగ్ రైతు భరోసా వెంటనే వేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి సాగర్ డిమాండ్ చేశారు సిపిఎం జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు రెండో రోజు యుటిఎఫ్ భవన్లో జరిగాయి ఈ శిక్షణ తరగతులకు ముఖ్య అతిథి హాజరై ఆయన మాట్లాడారు రాష్ట్ర ప్రభుత్వం నాలుగు ఎకరాల వరకు ఉన్న రైతులకు రైతు భరోసా వేసిందని అందులో కూడా చాలామందికి రాలేదని అన్నారు రాష్ట్ర వ్యవసాయ మంత్రి అప్పుడప్పుడు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తేదీలు ప్రకటిస్తున్నాడు తప్ప నాలుగు ఎకరాల పైబడ్డ వారికి ఇప్పటివరకు వేయకపోవడం దుర్మార్గమని అన్నారు మళ్ళీ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని ఖరీఫ్ కు సంబంధించిన రైతు భరోసా కూడా వేయాలని డిమాండ్ చేశారు రైతులకు అందుబాటులోకి విత్తనాలు ఎరువులు తేవాలని డిమాండ్ చేశారు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను తీవ్రంగా ముంచిందని ఇచ్చిన హామీని ఏ ఒక్కటి కూడా అమలు చేయలేదని అన్నారు ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు పూర్తిస్థాయిలో ఏ ఒక్కటి కూడా అమలు కావడం లేదని రాష్ట్ర ముఖ్యమంత్రి డబ్బులు లేవు కాబట్టి అమలు చేయలేకపోతున్నామని ప్రకటించడం శోచనీయమని ఎన్నికల హామీలు ఇచ్చేముందు రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వానికి ఆర్థిక పరిస్థితి తెలువదా అని ప్రశ్నించారు ఈ కార్యక్రమంలో, సిపిఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు కార్యదర్శివర్గ సభ్యులు బి ఆంజనేయులు ఆర్ శ్రీనివాస్ దేశీయ నాయక్ సి ఆంజనేయులు జిల్లా కమిటీ సభ్యులు పరుశరాములు బాలస్వామి ఎం శ్రీనివాస్ ఈశ్వర్ అశోక్ శివ వర్మ చింతల నాగరాజు రామయ్య జిల్లా నాయకులు కాశన్న సైదులు బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణా కు నీళ్లిచ్చిన కెసిఆర్ కు నోటీసులా...???

**సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తెలంగాణ అభివృద్ధి ప్రదాత, నిరంతర శ్రామికుడు, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కి కుట్రపూరితంగా కాంగ్రెస్ సర్కార్ నోటీసులు ఇవ్వడం అప్రజాస్వామికమని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ అదినేత, తెలంగాణ జాతిపిత,నీళ్లిచ్చిన కెసిఆర్ కు కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు హాజరుకావాలని కాంగ్రెస్ కమిషన్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ, బుధవారం జాగృతి అధ్యక్షురాలు,ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇందిరాపార్క్, ధర్నా చౌక్ దగ్గర చేపట్టిన ధర్నా కార్యక్రమానికి హాజరై సర్పంచుల సంఘం తరపున సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం విషపూరితమైన కుట్ర రాజకీయాలు మానుకోవాలని, వారు చేసే అసత్య ప్రచారాలు ప్రజలు ఎన్నటికీ నమ్మరని అన్నారు. ఎడారిలో ఉన్న తెలంగాణలో బీడు భూములకు నీళ్లు పారించి వ్యవసాయాన్ని పండుగలా చేసిన ఘనత కేసిఆర్ కే దక్కుతుందని తెలిపారు. వ్యవసాయ రంగంలో మునుపేన్నడు లేని విధంగా తెలంగాణ రాష్ట్రం గణనీయంగా పురోగతిని సాధించి దేశంలోనే ధాన్యం దిగుబడిలో అగ్రగామిగా నిలవడంతో కేసీఆర్ పాత్ర కాంగ్రెస్ నాయకులకు కనిపించలేదా..?? అని ప్రశ్నించారు. రైతాంగం పై ఉన్న మక్కువతో వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులకు కెసిఆర్ నాంది పలికారని అన్నారు. కుట్రపూరితమైన రాజకీయాలు మానుకొని ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై కాంగ్రెస్ సర్కార్ దృష్టి సారించాలని హితవు పలికారు.

# భూభారతి చట్టంతో రైతులకు న్యాయం

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దోకూరి ప్రభాకర్ రెడ్డి**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండపల్లి మండలంలోని బదనాపూర్ లో గ్రామంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో భాగంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా బుధవారం బదనాపూర్ గ్రామంలో తాసిల్దార్ నాగార్జున అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టంగా ఏర్పాటు చేసిన భూభారతి చట్టంతో ఎలాంటి భూ తగాదాలు రాకుండా 100 సంవత్సరాల ముందు చూపుతో భూభారతి చట్టం తీసుకురావడం జరిగిందని అన్నారు తలకొండపల్లి మండలంలో ఉన్న రైతులందరూ భూ యజమానులు తప్పనిసరిగా ఈ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు బోల యాదగిరి, ముదిరాజ్ యువజన కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్ నాయక్, స్థానిక నాయకులు లక్ష్మీకాంత్, శేఖర్, గణేష్ గౌడ్, అశోక్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

# మూడు పేదింటి వివాహాలకు ఆర్థిక సాయం

**అందించిన రాధాక్రిష్ణ ట్రస్టు ఛైర్మెన్ దశరథ్ నాయక్.**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కడ్తాల్ మండలంలో జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు పేదింటి వివాహాలకు వరంగా మారుతున్నాయి. బుధవారం ఒక్కరోజే మూడు వివాహాలకు ఆర్థిక సాయంతో పాటు మేనమామ కట్నం కింద పట్టుచీర మంగళసూత్రాలు ట్రస్ట్ చైర్మన్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ అందించారు. మంగళపల్లి వసంత నరసింహ దంపతుల కుమార్తె ప్రజ్ఞ వివాహానికి 21000 తో పాటు పట్టుచీరను కానుక అందించారు. అనంతరం కేశమౌని యాదమ్మ జంగయ్య దంపతుల కుమార్తె మౌనిక వివాహానికి 21000 ఆర్థిక సాయంతో పాటు పట్టుచీరను కానుకగా అందించారు. తదుపరి గుర్లకుంట గ్రామానికి చెందిన ఆంగోత్ నాన్కు రమేష్ దంపతుల కుమార్తె అఖిల వివాహానికి 21000 ఆర్థిక సాయంతో పాటు మేనమామ కట్నం కింద పట్టుచీరను కానుకగా అందించారు. దానికి తోడు మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ కేశమో కుటుంబానికి ఆముగోత్ కుటుంబానికి చేరు 5000 రూపాయల చొప్పున 10,000 ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన నాయకుడు హన్మ నాయక్ ,డైరెక్టర్ నరేష్, మాజీ డైరెక్టర్ లయక్ అలీ, మాజీ వార్డ్ సభ్యులు మూడ అశోక్, రామచంద్రయ్య, మహేష్ నాయకులు అమృతం పాండు, మూడ బాలయ్య ,సురేష్, శ్రీను నాయక్ ,మోహన్, రవి, సిద్ధి గారి వెంకటేష్, అంజి, శ్రీకాంత్, మూడ రవి ,రాఘవేందర్, గణేష్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పాత అలవాట్లు పక్కనపెట్టి పనిచేయండి

**అందరికీ అండగా ఉంటా**

**ఆపదలో ఆప్తుడిగా వస్తా**

**100 రోజుల అవగాహన కార్యక్రమంలో వనపర్తి శాసనసభ్యులుతూడి మేఘారెడ్డి**



**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా:** వనపర్తి మున్సిపాలిటీలో పనిచేసే అధికారులు సిబ్బంది అందరూ వారి వారి పాతా అలవాట్లను పక్కకు పెట్టి పట్టణాభివృద్ధి కోసం పని చేయాలని మీకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న అండగా ఉంటానని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.బుధవారం వనపర్తి మునిసిపాలిటీలో నిర్వహించిన 100 రోజుల కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.వార్డు అధికారులుగా, మెప్మా ఆర్పీలుగా, జవాన్లుగా, మీరు నిరంతరం వనపర్తి పట్టణ ప్రజలకు అందించే సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే వారిని అభినందించారు రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి వనపర్తి జిల్లా కేంద్రం పై ఉందని త్వరితగతిన అభివృద్ధి చెందే వనపర్తి పట్టణాభివృద్ధిలో మీరందరూ భాగస్వాములు కావాలన్నారు.గతంలో మీరు ఎలా పనిచేశారన్నది పక్కకు పెడితే నేటి నుంచి నిబద్ధతతో పనిచేయాలని, విధి నిర్వహణలో మీ దృష్టికి వచ్చే పొరపాట్లను నివృత్తి చేస్తూ, సమస్యలను పరిష్కరిస్తూ, ప్రజలకు ఉత్తమమైన సేవలు అందించాలని ఆయన సూచించారు.ముఖ్యంగా ఓటర్ లిస్ట్ పై ప్రత్యేక దృష్టి సారించి నిజమైన పట్టణ ఓటర్లను గుర్తించి, డబల్ ఎంట్రీలు ఉన్న వాటిని తొలగించాలని ఆయన సూచించారు.పని విషయంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మధుసూదన్ రెడ్డి మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తలకొండపల్లి మండల కేంద్రంలో ఘనంగా వంశీచందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దోకూరి ప్రభాకర్ రెడ్డి**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండపల్లి మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరిప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో తలకొండపల్లి లో ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి పలువురికి పంచిపెట్టారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్వకుర్తి అభివృద్ధికి అహర్నిశలు కృషిచేసిన వంశీ చందర్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగిందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు మిట్టపల్లి అంజయ్య,అజీమ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మోహన్ రెడ్డి, రవీందర్, కృష్ణ, బోల్లయాదగిరి, మండల కాంగ్రెస్ మైనార్టీ ఎండి సారీ ఆరీప్ రాజేందర్, జనార్ధన్, ప్రవీణ్ రెడ్డి, మాజీ ఎంపిటిసి రాములు, విష్ణు గౌడ్, నరేష్, శ్రీను, యాదగిరి, బాబుమోహన్, రాఘవేందర్, చిన్న కేశవులు, శ్రీశైలం ,తిరుపతి, హరిఫ్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు కల్వకుర్తి నియోజకవర్గంలో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పర్యటన



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** నేడు కల్వకుర్తి నియోజకవర్గంలో వివిధ కార్యక్రమంలో పాల్గొననున్న తెలంగాణ రాష్ట్ర టాస్క్ సి ఓ ఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పర్యటన వివరాలు యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్ సోదరుడి వివాహం ఉదయం 10:30 గంటలకు టంకరి రాంరెడ్డి గార్డెన్స్ కందుకూరు ఎక్సు రోడ్ లో జరుగును. అనంతరం 11: 30 నిమిషాలకు తలకొండపల్లి మండలం ఖానాపూర్ సీనియర్ నాయకులు తిరుమణి యాదయ్య గౌడ్ కుమార్తె వివాహ వేడుకలో పాల్గొననున్నారు. మధ్యాహ్నం 12:30 గంటలకు చారకొండ మండలం పడమటి తండా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మణిపాల్ అన్న కూతురి వివాహ వేడుకలలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించనున్నారు. మధ్యాహ్నం 1:00 గంటలకు చారకొండ మండలం జూపల్లి మాజీ ఉపసర్పంచ్ లింగం వివాహం పద్మావతి గార్డెన్ లో జరుగును అనంతరం 1:30 గంటలకు కల్వకుర్తి మండలం జంగారెడ్డిపల్లి గ్రామంలో ఆంజనేయస్వామి నూతన దేవాలయంలో పాల్గొని విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకానున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి,కావున అందుబాటులో ఉన్న ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు, నాయకులు, అభిమానులు,శ్రేయోభిలాషు లందరూ పాల్గొనగలరని మనవి.

# డివిజన్ల పునర్ విభజన గందరగోళంగా కాకుండా ప్రజలకు అనుకూలంగా జరగాలి

**33వ డివిజన్ లో 14-2 సిరిస్ ను సుమారు 800 వందల ఇండ్లను తొలగించిన అవగాహన లేని అధికార యంత్రాంగం**

**డివిజన్ ల పునర్ విభజనలో దళితలు పట్ల వివక్ష చూపుతున్న అధికార యంత్రాంగం**

**ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్**

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):** మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, తెలంగాణ ప్రభుత్వం ఎండార్స్మెంట్ నెం.: 767743/2025/1, తేది: 31.05.2025 ద్వారా రామగుండం నగరపాలక సంస్థ (60) వార్డులుగా ప్రకటన చేయడం జరిగుందని దానికి సంబంధించి ప్రభుత్వం జి.ఓ 269 ప్రకారం వార్డుల విభజన జరిగిందని పత్రిక ప్రకటనలో చూడడం జరిగిందని ఇందులో భాగంగా రామగుండం నగర పాలక సంస్థలోని ప్రస్తుత 33వ డివిజన్ లోని నూతనంగా 41వ డివిజన్ గా మారుతున్న తరుణంలో 14-2-67 నుండి 14-2 సిరిస్ ని పూర్తిగా అవగాహన లేని అధికార యంత్రాంగం తొలగించడం ఏమిటని ఫైట్ ఫర్ బెటర్ సోసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ అధికారుల పై అగ్రహం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసలు రామగుండం నగర పాలక సంస్థ ఏ పద్ధతి ప్రకారం డివిజన్ లను పునర్ విభజన చేసారని కనీసం డివిజన్లో సర్వే కూడా చేయకుండా ప్రజా అభిప్రాయం లేకుండా కేవలం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో లో కుర్చొని వారికి ఇష్టం వచ్చినట్లు చేర్పులు మార్పులు చేసుకున్నారా అని ప్రశ్నించారు. విచిత్రం ఏమంటే 33వ డివిజన్ లో సుమారు ఎనిమిది వందల ఇండ్లు వరకు పూర్తిగా దళిత సామజిక వర్గం చెందిన వారి ఇండ్ల సిరీస్ను తోలగించారని, మరి ఇది అవగాహనా లేకనా లేక కావాల్సి దళితుల పట్ల వివక్షన అని ఆగ్రహం వ్యక్తం చేసారు.




గంధరగోలంగా డివిజన్ల పునర్ విభజన చేసారని, అధికారులు వెంటనే అల్ పార్టీ ప్రజాసంఘాల, స్వచ్ఛందా సంస్థల సమావేశం ఏర్పాటు చేసి ప్రజలకు అనుగుణంగా పునర్ విభజన జరగాలని డిమాండ్ చేసారు.డివిజన్ల పునర్విభజనలో భాగంగా దళితుల పట్ల వివక్ష చూపుతున్న అధికార యంత్రాంగం పద్ధతులు మార్చుకోవాలని దినేష్ డిమాండ్ చేశారు. కొంతమంది అధికార పార్టీ నేతలకు అనుకులంగా డివిజన్ లను మార్చుకునే ప్రయిత్నాలు కొనసాగుతున్నాయని వారికి అధికారులు సహకరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయన్నారు.

## నూతన తహశీల్దార్ కు సన్మానం



**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్/ గండీడ్:** ఈరోజు గండీడ్ మండల నూతన తహశీల్దార్ ను కలిసి శాలువతో సన్మానం చేసిన మండల అంబేద్కర్ సంఘం మరియు ఎంఆర్పిఎస్ కార్మిక సంఘం ఇతర ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ మండలంలో ఉన్నటువంటి భూ సమస్యలు ఇతర సమస్యలు అన్నిటిని కూడా పరిష్కారం చేసి ప్రజలకు అండగా ఉండాలని మరియు అధికారులకు కూడా ప్రజాసంఘాల నాయకులు అందరం మా వంతుగా సహకారం ఉంటుందని తెలియజేయడం జరిగింది ఎమ్మార్వో మల్లికార్జున్ రావు మాట్లాడుతూ నా పరిధిలో ఎటువంటి సమస్యలు ఉన్న ప్రజలకు నేను అన్ని రకాలుగా సహకారం అందిస్తానని మరియు సమస్యలు పరిష్కారం చేస్తానని సానుకూలంగా స్పందించడం జరిగింది. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మాజీ ఎంపీటీసీ కప్లాపూర్ ఆశన్న, భవన నిర్మాణ కార్మిక సంఘం మరియు కళాకారుల సంఘం అధ్యక్షులు గుముడాల చెన్నప్ప,ఉమ్మడి పాలమూరు జిల్లా అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు పగిడ్యాల్ బోరు కృష్ణయ్య, గండీడ్ మండల ఎంఆర్పిఎస్ అధ్యక్షులు కామి వెంకట్ రాములు వెన్న చేడ్ గ్రామ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు గుర్రాల చెన్నయ్య ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి బాగయ పల్లి శంకర్ అధికార ప్రతినిధి కామి సంజీవులు ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు కోట్యానాయక్ ఉపాధ్యక్షులు లక్కగల్ల నర్సింలు చెలిమిల్ల మాజీ ఉప నీరటి బాలక్రిష్ణ, సర్పంచ్ వడ్ల శ్రీనివాస్ కృష్ణంరాజు మెట్టు మొగులయ్య అయ్యి శ్రీనివాస్ లక్కగాళ్ల చంద్రశేఖర్, లింగాయ పల్లి గోపి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి తహసిల్దార్ విజయ్ కుమార్




**అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి)"** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ భూభారతి రెవెన్యూ సదస్సులో భాగంగా శంషుద్దీన్ పూర్ హుల్గేర గ్రామంలో గ్రామ సభ నిర్వహించడం జరిగింది కార్యక్రమానికి మండలం తాహసిల్దార్ విజయ్ కుమార్ పాల్గొన్నారు వారు మాట్లాడుతూ రైతుల భూ భారతి చట్టాన్ని సద్వినియోగపరుచుకోవాలన్నారు భూ సమస్యలు ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకుని ఈ చట్టం ద్వారా పరిష్కరించుకోవాలని తెలిపారు.రైతులతో రెవెన్యూ సంస్థల యొక్క ఉద్దేశము దాని ప్రయోజనాల గురించి వివరించడం జరిగినది. సమావేశంలో రైతులనుండి దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో ఆర్ ఐ శ్రీకాంత్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏసప్ప పంచాయతీ కార్యదర్శిలు ప్రియాంక శివకుమార్ గ్రామ పార్టీ అధ్యక్షులు గ్రామ నాయకులు గ్రామ రైతులు ప్రజాప్రతినిధులు యువకులు పాల్గొన్నారు

## ఆర్సీబీ విజయోత్సవంలో పెను విషాదం?..

## ఏడుగురి దుర్మరణం



బెంగళూరులో జరుగుతున్న ఆర్సీబీ విజయోత్సవ సంబురాల్లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఆటగాళ్ల సన్మాన కార్యక్రమం జరగాల్సిన చిన్న స్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట జరగగడంతో ఏడుగురు మృతి చెందినట్లు తెలుస్తుంది. పదుల సంఖ్యలో గాయపడ్డారని సమాచారం. ఇంకా పలువురి పరిస్థితి విషమంగా ఉందని తెలుస్తుంది. స్టేడియంలోకి ఒక్కసారిగా భారీ సంఖ్యలో అభిమానులు దూసుకురావడంతో ఈ ప్రమాదం? సంభవించినట్లు స్థానికులు చెబుతున్నారు. జనాలను అదుపు చేసే క్రమంలో పోలీసులు లాఠీఛార్జ్ చేశారని తెలుస్తుంది. స్టేడియం బయట విషాద ఛాయలు అలుముకున్నా లోపల ఆటగాళ్ల సన్మాన కార్యక్రమం మాత్రం యధాతథంగా కొనసాగింది. ఆర్సీబీ ఆటగాళ్లంతా వేదికపై వచ్చి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సిద్దరామయ్య చేతుల మీదుగానే ఆటగాళ్లను సన్మానం జరగాల్సి ఉంది. 18 ఏళ్ల తమ ఐపీఎల్ టైటిల్ కలను సాకారం చేసినందుకు గాను ఆర్సీబీ ఆటగాళ్లకు ఈ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. తొలుత ఆర్సీబీ యాజమాన్యం ఓపెన్ టాప్ బస్‌లో విక్టరీ పరేడ్‌ను ప్లాన్ చేసింది. అయితే ఈ సమస్యలను ముందే ఊహించి పోలీసులు విక్టరీ పరేడ్‌కు అనుమతి నిరాకరించారు. అయినా అభిమానులు ఆటగాళ్ల సన్మాక కార్యక్రమం జరగాల్సిన చిన్నస్వామి స్టేడియం వద్దకు భారీగా చేరుకున్నారు. అభిమానులు ఈ స్థాయిలో తరలి రావడంతో పోలీసులు కంట్రోల్ చేయలేకపోయారు. లాఠీచార్జ్ చేయడంతో పరిస్థితి అదుపు తప్పినట్లు తెలుస్తుంది. కాగా, 18 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆర్సీబీ ఐపీఎల్ ఛాంపియన్‌గా అవతరించింది. నిన్న (జూన్ 3) జరిగిన 2025 సీజన్ ఫైనల్లో ఆ జట్టు పంజాబ్ కింగ్స్‌పై 6 పరుగుల తేడాతో విజయం సాధించి, తొలిసారి టైటిల్‌ను కైవసం చేసుకుంది. 18 సీజన్ల ప్రస్థానంలో నాలుగు సార్లు ఫైనల్‌కు చేరిన ఆర్సీబీ నాలుగో ప్రయత్నంలో టైటిల్ కలను సాకారం చేసుకుంది. ఈ టైటిల్ కోసం ఆర్సీబీ స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లి కూడా 18 సీజన్లు వేచి చూడాల్సి వచ్చింది. 18 ఏళ్లుగా ఆర్సీబీకే ప్రాతినిథ్యం వహిస్తున్న విరాట్ ఎట్టకేలకు 18వ ఎడిషన్‌లో టైటిల్ కలను సాకారం చేసుకున్నాడు. ప్రతి సీజన్‌కు ముందు ఆర్సీబీ అభిమానులు ఈ సాలా కప్ నమదే అంటూ ఎదురుచూసేవారు. ఎట్టకేలకు వారి కల కూడా 18వ ప్రయత్నంలో సాకారమైంది.

## స్ఫూర్తి పురస్కారాం



అగ్నిధారన్యూస్ గోదావరిఖని మాదిరెడ్డి ఇందుమతి భాస్కర్ రావ్ చరిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మాదిరెడ్డి నాగరాజ్ కుమార్తె మాదిరెడ్డి కావ్య శ్రీతాత గారైన భాస్కర్ రావ్ స్ఫూర్తితో వారి ట్రస్ట్ ద్వారా గోదావరిఖనిలో అనేకమైన సేవ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, కరోన మహమ్మారి వలన వారి తండ్రి మృతి చెందితే వారి మరణంతరం చారిటబుల్ ట్రస్ట్ సేవలు ఆగిపోవద్దు అనే ఉద్దేశంతో అట్టి బాధ్యతలు తీసుకొని గోదావరిఖనిలో ఉన్నన్ని రోజులు తమ ట్రస్ట్ ద్వారా అనేక సేవలు సహాయాలు చేసి అనంతరం హైద్రాబాద్ లో స్థిరపడటంతో అక్కడ మాదిరెడ్డి ఇందమతి భాస్కర్ రావ్ ట్రస్ట్ ద్వారా కుటుంబ సభ్యులసహకారంతో సేవలు చేయడంతో పాటు తనకు తెలిసిన కళ రంగంలో ముందుకు సాగుతూ అనేక మందికి శిక్షణను ఇస్తూన్న తరుణంలో కావ్య శ్రీ సేవలను గుర్తించి వసుంధర విజ్ఞాన వికాస మండలి సామాజిక, సంస్కృతిక, చైతన్య వేదిక స్ఫూర్తి 32వ వార్షికోత్సవం సందర్భంగా కావ్య శ్రీకి హైద్రాబాద్ లోని రవీంద్ర భారతిలో జూన్ 10వ తేదీన అతిరథ మహారాథుల చేతులమీదుగా ఇట్టి పురస్కారాన్ని అందుకోబోతున్న సందర్భంగా ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ హర్షం వ్యక్తం చేసారు.దినేష్ మాట్లాడుతూ..... తాతగారైన మాదిరెడ్డి భాస్కర్ రావుమరియు తండ్రిగారైన రెడ్డి నాగరాజుఆశయాలతో మరింత ముందుకు సాగాలని మరిన్ని సేవా కార్యక్రమాలు చేసి ఇలాంటి పురస్కారాలు పొందాలని పేర్కొన్నారు. ఈ పూరస్కారానికి సహకరించిన వసుంధర విజ్ఞాన వికాస మండలి సభ్యులు మధుకర్ సార్ కి ప్రత్యేక ధాన్యవాదాలు కావ్య శ్రీ తెలపడం జరిగింది.

## అజయ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఉప్పల వెంకటేష్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి మండలం లింగసాని పల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ జిల్లా యూత్ వింగ్ నాయకుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు అజయ్ జన్మదినం సందర్భంగా హైదరాబాద్ లోని ఉప్పల వెంకటేష్ కార్యాలయంలో కేక్ కట్ చేసి అజయ్ కి జన్మ దిన శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట నాయకులు ఉప్పల వెంకటేష్ ఈ కార్యక్రమంలో, తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు దారమోని గణేష్, నవీన్ ,రాఘవ ఉదయ్ శంకర్, శ్రీను నరేష్, ఉదయ్, అనిల్,రమేష్,సూరి ,రాకేష్ తదితరాలు పాల్గొన్నారు.

## మహాధర్నాకు బయలుదేరిన తెలంగాణ జాగృతి నాయకులు

**జాగృతి జిల్లా నాయకులు దార మోని గణేష్**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద మాజీ ముఖ్యమంత్రి, తెలంగాణ జాతిపిత కల్వకుంట్ల చంద్రశేఖర రావు కి కాలేశ్వరం కమిషన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం వత్తిడితో ఇచ్చిన నోటీసులకు నిరసనగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో తలపెట్టిన మహా ధర్నాకు బయలుదేరిన నాగర్ కర్నూల్ జిల్లా తెలంగాణ జాగృతి నాయకులు.ఈ కార్యక్రమంలో, జిల్లా జాగృతి అధ్యక్షుడు దారమోని గణేష్,అజయ్, నవీన్ ,రాఘవ ఉదయ్ శంకర్, శ్రీను నరేష్, ఉదయ్, అనిల్,రమేష్, సూరి ,రాకేష్ తదితరాలు పాల్గొన్నారు.

## వెల్జాల్ లో ఘనంగా వంశీ చందర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామం లో కల్వకుర్తి మాజీ శాసనసభ్యులు, సి.డబ్ల్యూ.సి సభ్యులు ఏఐసిసి కార్యదర్శి డిలిమినేషన్ కమిటీ చైర్మన్ చల్లా వంశీ చందర్ రెడ్డి జన్మదిన వేడుకలను మార్కెట్ కమిటీ డైరెక్టర్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసమూర్తి, మాజీ ఉప సర్పంచ్ అజీజ్ మాజీ ఎంపిటిసి అంబాజీ మండల కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి ఆరిఫ్, ఆధ్వర్యంలో వెల్జాల్ గ్రామంలో బాణసంచా కాల్చి కేక్ కటింగ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో, సింగల్ విండో మాజీ చైర్మన్ ఆయిల్ అంజయ్య గౌడ్ మాజీ ఉపసర్పంచ్ బి నర్సింలు, ఏ వెంకట్ రెడ్డి, అశోక్ బాబు, ఏ రవీందర్ గౌడ్, ఎండి యూసుఫ్, వి రాజు, లింగం యాదవ్ ఎల్ మల్లేష్, కే బాలయ్య, రవికుమార్, చింతకాయల లక్ష్మణ్, పులిజాల విష్ణు, తారద్దీన్, బురమోని మల్లయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## మత్తుమందు డాక్టర్ సస్పెండెడ్

**- లంచం డిమాండ్ చేసిన డాక్టర్ మోహన్ రావు**




**అగ్నిధార న్యూస్ మంథని :** ట్యూబోక్టమి పేషేంట్ వద్ద లంచం డబ్బులు డిమాండ్ చేసిన మత్తుమందు డాక్టర్ మోహన్ రావు ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంథని సామాజిక ఆసుపత్రి లో మత్తు మందు ప్రత్యేక వైద్యునిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ మోహన్ రావు రచ్చపల్లి గ్రామానికి చెందిన పేషంట్ కొడాలి భాగ్య నుంచి ట్యూబోక్టమి నిర్వహించేందుకు 5000 రూపాయలు లంచం డిమాండ్ చేస్తూ దొరికిపోయారని, ఆ డాక్టర్ పై పలు ఫిర్యాదులు ఇప్పటికే నమోదైన నేపథ్యంలో సదరు మత్తుమందు డాక్టర్ ను సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

http://www.agnidharanews.com
అగ్నిధార
నిజాల నిప్పు కణిక

# తెలుగు రాష్ట్రాల్లో జామాతేలు

**హైదరాబాద్ :** అటు ఆంధ్ర, ఇటు తెలంగాణలో ఒకటే పేరు అది అనిల్... జామాత దశమ గ్రహం.. అంటారు.. యాదృచ్ఛికమే గాని...రెండు చోట్ల అదే పేరు తెరపైకి వచ్చింది. వైఎస్ షర్మిల భర్తపేరు బ్రదర్ అనిల్. ఇక బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత భర్తపేరు అనిల్‌కుమార్. తెలుగు రాష్ట్రాల్లో రాజకీయంగా ప్రముఖమైన ఈ ఇద్దరు మహిళల భర్తల పేర్లు 'అనిల్' కావడం ఒక ఆసక్తికరమైన యాదృచ్ఛికం. ఈ పేరు వారి జీవితంలోని ఇబ్బందులకు కారణమా అనే ప్రశ్న సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశమైంది.అనిల్' అనే పేరు సంస్కృతం నుండి ఉద్భవించింది, ఇది "వాయు దేవుడు" లేదా "గాలి" అని అర్థం. హిందూ సంప్రదాయంలో, పేరు ఎంపిక జన్మ నక్షత్రం, రాశి, జాతకంతో సంబంధం కలిగి ఉంటుంది. జ్యోతిషశాస్త్రంలో, 'అనిల్' స్వేచ్ఛ, చైతన్యం, శక్తిని సూచించే శుభప్రదమైన పేరుగా పరిగణించబడుతుంది. ఈ పేరు మొదటి అక్షరం 'అ' కొన్ని నక్షత్రాలకు (ఉదాహరణకు, అశ్విని, కృత్తిక) అనుకూలంగా ఉంటుంది. కానీ దీని శుభాశుభ ప్రభావం వ్యక్తి జాతకంపై ఆధారపడి ఉంటుంది. జ్యోతిష్యంలో, ఒక పేరు వల్ల జీవితంలో సవాళ్లు రావడం అనేది గ్రహ స్థితులు, దశలు, కర్మ ఆధారంగా ఉంటుంది, కానీ 'అనిల్' పేరు సాధారణంగా ప్రతికూల సూచనలతో ముడిపడి ఉండదు. అందువల్ల షర్మిల, కవిత ఇబ్బందులకు ఈ పేరు కారణమని ఊహించడం జ్యోతిషశాస్త్ర ఆధారంగా సమర్థనీయం కాదు.వైఎస్ షర్మిల, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర రెడ్డి కుమార్తె, రాజకీయంగా అనేక సవాళ్లను ఎదుర్కొన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో తన అన్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో విభేదాల తర్వాత, వైఎస్సార్ తెలంగాణ పార్టీ పెట్టారు. ఆదరణ రాకపోవడంతో ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరి సొంత రాజకీయ గుర్తింపు సాధించేందుకు ప్రయత్నిస్తున్నారు. 2024 ఎన్నికలలో ఆమె కడప నియోజకవర్గం నుండి పోటీ చేసినప్పటికీ, విజయం సాధించలేకపోయారు.షర్మిల భర్త అనిల్ కుమార్, ఒక క్రైస్తవ ప్రచారకుడు, ఆమె రాజకీయ నిర్ణయాలపై ప్రభావం చూపినట్లు కొన్ని సోషల్ మీడియా పోస్టులు సూచించాయి. ఉదాహరణకు, బయ్యారం గనుల వివాదంలో అతని పేరు వివాదాస్పదంగా మారింది, కానీ ఇవి ఎక్కువగా ఆరోపణలు మాత్రమే. షర్మిల సవాళ్లు రాజకీయ పోటీ, కుటుంబ విభేదాలు, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఆమె స్థానం కోసం పోరాటం నుండి ఉద్భవించాయి. ఈ సమస్యలకు 'అనిల్'





పేరుతో సంబంధం లేదని స్పష్టమవుతుందికల్వకుంట్ల కవిత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు కుమార్తె, భారత రాష్ట్ర సమితి నాయకురాలిగా గుర్తింపు పొందారు. 2024లో ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఆమె అరెస్టు రాజకీయంగా వివాదాస్పదమైంది. ఈ కేసు కేంద్ర ఏజెన్సీలైన ఈడీ మరియు సీబీఐ దర్యాప్తులతో ముడిపడి ఉంది, ఇది బీఆర్ఎస్ పార్టీ రాజకీయ స్థితిని బలహీనపరిచింది. అదనంగా, ఆమె తన సోదరుడు కేటీఆర్‌తో కొన్ని రాజకీయ విభేదాలను ఎదుర్కొన్నట్లు గీలోని కొన్ని చర్చలు సూచిస్తున్నాయి. కవిత భర్త అనిల్ దేవ్ ఈ వివాదాలలో ప్రత్యక్షంగా ప్రమేయం లేనప్పటికీ, ఆమె సవాళ్లు రాష్ట్ర రాజకీయ ఒడిదొడుకులు, చట్టపరమైన ఒత్తిడులు పార్టీలో ఆమె పాత్రకు సంబంధించినవి. 'అనిల్' పేరు ఈ సమస్యలతో ఎటువంటి సంబంధం లేదని స్పష్టమవుతుంది.షర్మిల, కవిత భర్తల పేరు 'అనిల్' కావడాన్ని ఒక యాదృచ్ఛికంగా గుర్తించి, ఈ పేరు వారి ఇబ్బందులకు కారణమా అని ప్రశ్నించాయి. ఈ చర్చలు ఎక్కువగా హాస్యాస్పదంగా లేదా ఊహాగానాలుగా ఉన్నాయి, కానీ ఇవి వాస్తవ ఆధారాలపై ఆధారపడవు. "అనిల్ అనే పేరు షర్మిల, కవితలకు శాపంగా మారిందా?" అని సరదాగా ప్రశ్నించగా, మరొక పోస్ట్ ఈ ఇద్దరు మహిళల రాజకీయ సవాళ్లను వారి భర్తల ప్రభావంతో ముడిపెట్టింది. అయితే, ఈ ఆలోచనలు వాస్తవికత కంటే ఊహాజనితమైనవి.తెలుగు రాష్ట్రాల్లో రాజకీయంగా చురుకైన మహిళలు ఎదుర్కొనే సవాళ్లు తరచూ కుటుంబ నేపథ్యం, సామాజిక అంచనాలు, రాజకీయ పోటీతో ముడిపడి ఉంటాయి. షర్మిల, కవిత ఇద్దరూ బలమైన రాజకీయ కుటుంబాల నుండి వచ్చినవారు, కానీ వారి సొంత గుర్తింపు సాధించడం కోసం పోరాటం చేయాల్సి వచ్చింది. ఈ సందర్భంలో, వారి భర్తల పేరు 'అనిల్' కావడం కేవలం యాదచ్ఛికం మాత్రమే, మరియు ఈ పేరు వారి సవాళ్లకు కారణమని భావించడం ఆధార రహితం.జ్యోతిషశాస్త్రంలో, ఒక వ్యక్తి జీవితంలో సవాళ్లు గ్రహ స్థితులు, దశలు, వ్యక్తిగత కర్మపై ఆధారపడతాయి, కానీ పేరు ఒక్కటే ఈ సవాళ్లకు కారణం కాదు. అదే సమయంలో, సామాజిక మాధ్యమాల్లో ఇలాంటి చర్చలు తరచూ రాజకీయ ఉద్దేశాలతో లేదా హాస్యం కోసం జరుగుతాయి. షర్మిల, కవిత విషయంలో, వారి సవాళు రాజకీయ ఒత్తిడులు, చట్టపరమైన సమస్యలు, మరియు కుటుంబ డైనమిక్స్ నుండి ఉద్భవించాయి, 'అనిల్' అనే పేరు నుండి కాదు

# రాజీవ్ యువవికాస్ పథకం మరింత ఆలస్యం


**హైదరాబాద్ :** రాజీవ్ యువ వికాసం స్కీమ్ అమలుపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇవాళ అందజేయాల్సిన శాంక్షన్ లెటర్ల ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేసింది. మరింత పూర్తి స్థాయి పరిశీలన తర్వాతే అర్హుల జాబితాలను ప్రకటించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు.తెలంగాణ రాజీవ్ యువ వికాసం స్కీమ్ మంజూరు పత్రాల అందజేత ప్రక్రియ వాయిదా పడింది. ప్రభుత్వం ముందుగా ప్రకటించిన వివరాల ప్రకారం? నేటి నుంచి జూన్ 9వ తేదీ వరకు లబ్ధిదారులకు శాంక్షన్ లెటర్లను అందజేయాల్సి ఉంది. రూ. లక్షలోపు యూనిట్లకు ముందుగా ఇవ్వనున్నట్లు కూడా ప్రకటించింది. అయితే అనూహ్యంగా చివరి నిమిషంలో శాంక్షన్ లెటర్ల అందజేత ప్రక్రియపై సర్కార్ వెనక్కి తగ్గింది.రాజీవ్ యువ వికాసం స్కీమ్ కు భారీ దరఖాస్తులు వచ్చాయి. అన్ని జిల్లాల నుంచి కలిపి 16.22 లక్షల మంది అప్లికేషన్ చేసుకున్నారు. అనూహ్యమైన రీతిలో దరఖాస్తులు రావటంతో? దరఖాస్తుల పరిశీలన విషయంలో ప్రభుత్వం పలు జాగ్రత్తలను చేపట్టింది. అన్ని కోణాల్లో దరఖాస్తుదారుడి వివరాలను సేకరించే ప్రయత్నం చేసింది. విడతలవారీగా శాంక్షన్ లెటర్లను అందజేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ముందుగా రూ. లక్ష లోపు యూనిట్లను ఇచ్చేందుకు సిద్ధమైంది.భారీగా దరఖాస్తులు రావటంతో పరిశీలన ప్రక్రియ కాస్త ఇబ్బందిగానే కొనసాగింది. అయితే లబ్ధిదారుల ఎంపిక పక్కాగా ఉండాలని? అనర్హులకు దక్కవద్దనే అభిప్రాయాలు భారీగా వ్యక్తమవుతున్నాయి. ఇదే విషయాన్ని ప్రభుత్వంలోని మంత్రులు?. సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో సీఎం కీలక నిర్ణయం తీసుకున్నారు. పూర్తి స్థాయి పరిశీలన తర్వాతే అర్హుల జాబితాలను ప్రకటించాలని నిర్ణయించారు. ఒక్క అనర్హుడికి కూడా స్కీమ్ అందవద్దని



స్పష్టం చేశారు. ఈ అంశంపై మంత్రివర్గ భేటీలో చర్చించి? నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. దీంతో ఇవాళ చేపట్టాల్సిన మంజూరు పత్రాల జారీ ప్రక్రియ తాత్కాలికంగా వాయిదా పడాల్సి వచ్చింది.జూన్ 5వ తేదీన తెలంగాణ కేబినెట్ భేటీ కానుంది. ఇందులో యువ వికాసం స్కీమ్ తో పాటు మరికొన్ని స్కీమ్ లపై చర్చించనున్నారు. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. మరోవైపు చివరి నిమిషంలో శాంక్షన్ లెటర్ల ప్రక్రియ వాయిదా పడటంతో? పలువురు దరఖాస్తుదారులు నిరాశకు లోనయ్యారు.ఈ స్కీమ్ కింద ఈ ఏడాదికి 5 లక్షల మంది అర్హులను(లబ్ధిదారులను) ఎంపిక చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీని కోసం రూ.6,250 కోట్ల నిధులను కేటాయించింది. కేబినెట్ భేటీ తర్వాత? లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ముందుకుసాగటంతో పాటు శాంక్షన్ లెటర్లను అందజేసే అవకాశం ఉంది.

# ఆరోగ్య కేంద్రాల్లో సగం మందే ఉద్యోగులు

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో ఆరోగ్యకేంద్రాలు అనారోగ్యానికి గురయ్యాయి. సిబ్బంది కొరత కారణంగా నాణ్యమైన వైద్యసేవలు అందించడంలో వెనుకడుగు వేస్తున్నాయి. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో(యూ పీహెచ్‌సీ) అత్యంత కీలకమైన మెడికల్ అధికారి పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. నాడి పట్టే వైద్యులు లేక పేదలకు నానా అవస్థలు తప్పడం లేదు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నవారే అదనపు సెంటర్లలో వైద్యసేవలందిస్తున్నారు. మరికొన్ని కేంద్రాల్లో ఏఎన్ఎంలే చికిత్సనందిస్తుండటం గమనార్హం. పేదవాడికి జబ్బుచేస్తే వెంటనే గుర్తుకొచ్చేది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలే. కేసీఆర్ పాలనలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలతో పాటు బస్తీ దవాఖానలు సైతం ఏర్పాటు చేసి పేదవాడి ఇంటి ముందే ఉచిత వైద్యం చేరవేశారు. జిల్లాలోని బస్తీవాసులు, పేద ప్రజలు, మధ్యతరగతి ప్రజలకు బస్తీ దవాఖానలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు నిరంతరం నాణ్యమైన వైద్యసేవలందించాయి. కానీ నేడు అవన్నీ సిబ్బంది కొరతతో స్వాగతం పలుకుతున్నాయి.హైదరాబాద్ జిల్లా వైద్యారోగ్యశాఖ పరిధిలో మొత్తం 85 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వాటిల్లో కేవలం 45 మంది మెడికల్ అధికారులే ఉండటం గమనార్హం. ఎనిమిది నెలల కిందట జరిగిన బదిలీల్లో హైదరాబాద్ జిల్లాలోని 40 మంది మెడికల్ అధికారులను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. ఇక్కడి నుంచి బదిలీ చేసిన రాష్ట్ర సర్కార్ బదిలీ కారణంగా ఏర్పడ్డ ఖాళీలను నింపడంలో నిర్లక్ష్యపు ధోరణితో వ్యవహరిస్తున్నది.ఈ కారణంగా ప్రస్తుతం ఒక్కో మెడికల్ అధికారి వారంలో మూడురోజులు విధులు నిర్వహిస్తున్న కేంద్రంలో, మరో మూడు రోజులు మెడికల్ అధికారి లేని సెంటర్‌కు వెళ్లి విధులు నిర్వహిస్తున్నారు. దీని కారణంగా మెడికల్ అధికారులు అధిక పని ఒత్తిడికి గురవుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి యూపీహెచ్‌సీలో కనీసం ఒక మెడికల్ అధికారి, ఒక ఫార్మసిస్ట్, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఏఎన్ఎంలు విధులు నిర్వహించాల్సి ఉంది. కానీ జిల్లాలో కీలకమైన మెడికల్ అధికారి పోస్టులే ఖాళీగా ఉన్నాయి.రోగి ఆరోగ్య పర్యవేక్షణలో మెడికల్ అధికారి పాత్ర కీలకం. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించడం, సాధారణ జ్వరం నుంచి వ్యాధి నిర్ధారణ వరకు పలు సమస్యలకు మందులు



సూచించడం, మాతా శిశు ఆరోగ్య కార్యక్రమం వంటి ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేయడం, చిన్న చిన్న గాయాలకు చికిత్సలందించడం, పోషకాహారం, వ్యాధి నివారణపై సలహాలు అందించడంతో పాటు ఇతర సిబ్బందిని ఎప్పటికప్పుడు మార్గనిర్దేశం చేయడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నారు. సంబంధిత సెంటర్‌లో మెడికల్ అధికారి పోస్టు ఖాళీగా ఉండటం వల్ల ఆ సెంటర్‌లో సరైన పర్యవేక్షణ కూడా కరవైపోతున్నది.రోగాలబారిన పడి వైద్య పరీక్షల కోసమని యూపీహెచ్‌సీలకు వచ్చే రోగులు మెడికల్ అధికారి లేకపోవడంతో సరైన వైద్య పరీక్షలు చేయించుకోలేకపో తున్నారు. ఏఎన్ఎంలు ఇచ్చే మాత్రలు తీసుకొని నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఖాళీలను భర్తీ చేయాల్సిన రాష్ట్ర సర్కార్ నేటికి చర్యలు చేపట్టని కారణంగా పేదవాడు ప్రభుత్వ వైద్యమంటే వెనకడుగు వేస్తున్న వైనం నెలకొంది. తమ ప్రాంతంలో ఉన్న యూపీహెచ్‌సీలో ఖాళీలను భర్తీ చేయా లంటూ జిల్లాలోని పలు ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

## పేద కుటుంబ నిర్మాణానికి సహకారం

ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్,ఉప్పల వెంకటేష్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద వైశ్య కుటుంబానికి చెందిన బొజ్జ సురేష్ తండ్రి రాములు ఇంటి నిర్మాణంలో ఫినిషింగ్ కు సిమెంట్ ఇవ్వడం జరిగింది.ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్ సిమెంట్ బస్తాలు అందించడం జరిగింది.తన ఇంటి నిర్మాణానికి సహకరించిన వెంకటేష్ కి తన కుటుంబం రుణపడి ఉంటుందని బొజ్జ సురేష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో, తలకొండపల్లి సీనియర్ నాయకులు కండె జగతయ్య, గోవిందు పాండు, తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం నగరపాలక సంస్థను 60 వార్డులుగా విభజిస్తూ నోటిఫికేషన్

**అగ్నిధారన్యూస్,( రామగుండం):** రామగుండం నగర పాలక సంస్థ ను 60 వార్డులుగా విభజిస్తూ ముసాయిదా నోటిఫికేషన్ విడుదల చేసినట్లు అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ), కమిషనర్ ( ఎఫ్ ఎ సి ) జె. అరుణ శ్రీ బుధవారం ఒక ప్రకటనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముసాయిదా నోటిఫికేషన్ ప్రచురించి నగర పాలక సంస్థ కార్యాలయం నోటీస్ బోర్డుపై ప్రదర్శనకు ఉంచినట్లు ఆమె తెలిపారు. ముసాయిదా కు సంబందించి ఆక్షేపణలు సలహాలు సూచనలు ఏవైనా ఉంటే ఈ నెల 11 వ తేదీ వరకు రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో సమర్పించాలని కోరారు.నగరంలో రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్న పశువులను వాటి యజమానులు వెంటనే తోలుకువెళ్లాలని అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ), కమిషనర్ ( ఎఫ్ ఎ సి ) జె. అరుణ శ్రీ ఒక ప్రకటనలో కోరారు. ప్రదాన రహదారుల వెంబడి పశువులు తిరుగుతుండడంతో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఏర్పడుతున్నదని అన్నారు. రోడ్లపై తిరుగుతున్న పశువులను గుర్తించి గోశాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కావున తమ పశువులను తీసుకెళ్ళి యజమానులు సహకరించాలని కోరారు. చెత్త బయట వేయకుండా మున్సిపల్ వాహనాలకే అందించాలని రామగుండం నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి కోరారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా బుధవారం మేడిపల్లి సెంటర్, అన్నపూర్ణ కాలనీ తదితర ప్రాంతాల్లో " తడి చెత్త , పొడి చెత్త వేరు చేయడం ప్రతి ఇంటి నుండి చెత్త సేకరించడం" పై ప్రజల్లో అవగాహన కల్పించడానికి మెప్మా ఆద్వర్యంలో స్వశక్తి మహిళలతో ర్యాలీ నిర్వహించారు. తడిచెత్తను పచ్చ రంగు డబ్బాలో పొడి చెత్తను నీలం రంగు డబ్బాలో ప్రమాదకరమైన చెత్తను ఎర్ర రంగు డబ్బాలో వేసి అందించాలని కోరారు. ఈ ర్యాలీలో సానిటరీ ఇన్స్పెక్టర్ కిరణ్ , మెప్మా టి ఎం సి మౌనిక , సి ఓ లు శ్వేత ఊర్మిళ ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ మధుకర్ , ఎం ఐ ఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ ఆర్ పి లు స్వశక్తి మహిళలు పాల్గొన్నారు.

## లింగాల లో రెవెన్యూ సదస్సు




**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్** కమాన్ పూర్ మండలంలోని నగరం గ్రామ పంచాయితీ పరిధిలోని లింగాల గ్రామంలో బుధవారం తహసిల్దార్ వాసంతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం భూ భారతి చట్టాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టింది అని భూమి సమస్యలు ఉన్నవాళ్లు దరకస్తులు చేసుకోవాలి అని ఆమె కోరారు... ఈ కార్యక్రమం లో రెవెన్యూ సిబ్బంది రైతులు పాల్గొన్నారు

## పెద్దమ్మతల్లి జోగు:



**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్** కమాన్ పూర్లి మండలంలోని పిల్లిపల్లే గ్రామంలో జరుగుతున్న పెద్దమ్మతల్లి ఉత్సవాల్లో భాగంగా మాజీ ఎంపీటీసీ పిల్లిశేకర్,జోగు కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లగా భక్తులు పెద్దమ్మ తల్లి పేరట జోగు సమర్పించుకున్నారు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్య లో ప్రజలు పాల్గొన్నారు...

బుధవారం 5 జూన్ 2025
అగ్నిధార





## బన్నీ వాస్‌తో చేతులు కలిపిన ప్రియదర్శి.. 'మిత్రమండలి' అంటూ కొత్త ప్రయాణం

'బలగం', 'కోర్టు', 'సారంగపాణి జాతకం' వంటి చిత్రాలతో నటుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్న ప్రియదర్శి ఇప్పుడు మరో కొత్త ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. గీతా ఆర్ట్స్ 2 బాధ్యతల నుంచి విరామం తీసుకున్న నిర్మాత బన్నీ వాస్, తన సొంత బ్యానర్ బన్నీ వాస్ వర్క్స్‌ని ప్రారంభించి, దానిలో మొదటి సినిమాగా ఒక కొత్త ఎంటర్‌టైనర్‌ను నిర్మించబోతున్నారు. ఈ చిత్రానికి మిత్రమండలి అనే టైటిల్ ఖరారు చేసినట్లు సమాచారం. ఈ చిత్రంలో కథానాయకుడిగా నటిస్తున్నాడు ప్రియదర్శి. ఈ మూవీకి సంబంధించి అప్‌డేట్‌ను త్వరలోనే వెల్లడించనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఇక ఈ సినిమాను బన్నీ వాస్‌తో పాటు, 'హాయ్ నాన్న' ఫేమ్ ఐరా ఎంటర్‌టైన్‌మెంట్స్ సప్త అశ్వ క్రియేషన్స్ నిర్మాణ సంస్థలు సంయుక్తంగా నిర్మించబోతున్నాయి. కామెడీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ సినిమాతో ఎస్ విజయేంద్రను దర్శకుడిగా పరిచయం కాబోతున్నాడు. ఆర్‌ఆర్ ధృవన్ సంగీతం అందించబోతున్నాడు.



## అప్పుడు నాతో అసభ్యంగా.. ఇప్పుడు స్టార్ డైరెక్టర్‌గా చెలామణీ

తెలుగు సినిమా ఇండస్ట్రీ.. పైకి కనిపించేంత అందంగా అయితే ఉండదు. ఎప్పటికప్పుడు పలువురు యంగ్ హీరోయిన్లు, యువతులు.. తమకు ఎదురైన చేదు అనుభవాల్ని బయటపెడుతుంటారు. శారీరకంగా ఎంతలా ఇబ్బంది పడ్డామనే విషయాన్ని చెబుతుంటారు. ఇప్పుడు కూడా మోడల్ కమ్ నటి అయిన మౌనీషా చౌదరి.. ఓ తెలుగు దర్శకుడి వల్ల తాను ఇబ్బంది పడిన విషయాన్ని బయటపెట్టింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ దీని గురించి పంచుకుంది. 'టాలీవుడ్‌కి చెందిన ఓ దర్శకుడు.. నాకు ఫోన్ చేసి ఆయన తీస్తున్న సినిమాలో నటించమని కోరాడు. అవకాశం ఇస్తానని కూడా చెప్పాడు. నాకు ఆ మూవీలో నటించడం ఇష్టం లేదు. ఇదే ఆయనకు చెప్పినా సరే వినకుండా నా తొడల సైజ్(కొలతల) గురించి అడిగి ఇబ్బంది పెట్టాడు. అసలు సినిమా అవకాశానికి, దానికి సంబంధం ఏంటి? ప్రస్తుతం ఆ దర్శకుడు స్టార్ అయిపోయాడు. పెద్ద పెద్ద యాక్టర్స్‌తో మూవీస్ చేస్తున్నాడు' అని మౌనీషా చౌదరి చెప్పుకొచ్చింది. మోడల్‌గా గుర్తింపు తెచ్చుకున్న మౌనీషా చౌదరి.. ప్రస్తుతం అమెరికాలోని ఉతాలో ఉంటుంది. 2016లో 'మిస్ ఆసియా ఉతా'గా కిరీటం గెలుచుకుంది. స్నో అక్కగా గుర్తింపు తెచ్చుకున్న ఈమెకు ఇన్ స్టాలో మంచి ఫాలోయింగ్ ఉంది. రీసెంట్‌గానే అమెరికా వెళ్లిన మంచు విష్ణుతో కలిసి 'కన్నప్ప' టూర్‌లో పాల్గొంది. సినిమాను ప్రమోట్ కూడా చేసింది. అలాంటి ఈమె.. తనకెదురైన క్యాస్టింగ్ కౌచ్ అనుభవాన్ని బయటపెట్టింది. కానీ సదరు దర్శకుడు పేరేంటి అనేది మాత్రం చెప్పలేదు.




## లక్ష్మీ నరసింహ రీ రిలీజ్.. ట్రైలర్ ఆగయా!

టాలీవుడ్ కొద్దికాలంగా రీ రిలీజ్‌ల ట్రెండ్ నడుస్తోంది. ఇటీవల మహేశ్ బాబు నటించిన ఖలేజా విడుదల కాగా.. బాక్సాఫీస్ వద్ద కళ్ల చెదిరే కలెక్షన్స్ రాబట్టింది. ఈ నేపథ్యంలో నందమూరి బాలకృష్ణ, ఆసిన్ జంటగా నటించిన సూపర్ హిట్ మూవీ లక్ష్మీ నరసింహ సైతం బిగ్ స్క్రీన్‌పై సందడి చేయనుంది. ఈనెల 10న బాలయ్య బర్త్ డే కావడంతో రెండు ముందుగానే ఈ సినిమాను థియేటర్లలో విడుదల చేస్తున్నారు. ఈ బ్లాక్‌బస్టర్ మూవీని జూన్ 8న థియేటర్లలో రీ రిలీజ్ చేస్తున్నారు ఈ నేపథ్యంలోనే తాజాగా ఈ మూవీ రీ రిలీజ్ ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. కాగా.. 200లో వచ్చిన ఈచిత్రానికి జయంత్ సి. పరాన్జీ దర్శకత్వం వహించారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ మూవీ శ్రీ సాయి గణేష్ ప్రొడక్షన్స్ పతాకంపై బెల్లంకొండ సురేశ్ నిర్మించారు. ఈ సూపర్ హిట్ చిత్రానికి మణిశర్మ సంగీతం అందించారు.



## ఆ హీరోయిన్ అంటే నాకు పిచ్చి.. ఆమెతో నటించాలని ఉంది

సినీప్రియులు అత్యధికంగా ఇష్టపడే సౌత్ హీరోలలో దుల్కర్ సల్మాన్ ఒకరు. ఎన్నో హిట్ చిత్రాల్లో నటిస్తూ తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ స్టార్ హీరో.. ఇప్పుడు లక్కీ భాస్కర్ సినిమాతో మరో విజయాన్ని అందుకున్నాడు. డైరెక్టర్ వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ సినిమాకు అడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తుంది. ఇప్పటికే రూ.100 కోట్లకు పైగా వసూల్లతో బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. ఇదెలా ఉంటే.. గతంలో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న దుల్కర్ సల్మాన్ తన కెరీర్ గురించి కాకుండానే పర్సనల్ లైఫ్ గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. అలాగే తనకు ఓ హీరోయిన్ తో నటించాలని ఉందని వెల్లడించారు. ఆమె మరెవరో కాదు.. బాలీవుడ్ అందాల తార కాజోల్. ఎన్నో హిట్ చిత్రాల్లో కాజోల్ తన పాత్రలకు ప్రాణం పోసిన తీరు ఎంతో అందంగా ఉంటుందని తెలిపాడు దుల్కర్. కాజోల్ పోషించే పాత్రలకు అన్ని భావోద్వేగాలను ప్రేక్షకులు నిజంగా అర్థం చేసుకోగలరని అన్నారు. 'నాకు కాజోల్‌తో నటించాలని ఉంది. ప్రతి సినిమాలో ఆమె పాత్రలను చూపించిన తీరు అద్భుతం. తన పాత్రలకు ఎంత అందంగా జీవం పోస్తుంది. ప్రేక్షకులు తమ ప్రతి కథలోని భావోద్వేగాలను సరిగ్గా అర్థం చేసుకోగలరు. ఆమె నవ్వితే గుండెల్లో నుంచి నవ్వినట్లుగా అనిపిస్తుంది. ఇక ఆమె ఏడ్చే పాత్రలు అదే ఎమోషనల్ రోల్స్ చేస్తే నిజంగానే జరిగిందా అన్నట్లుగా కనిపిస్తుంది. ఆమె పాత్రలను అంత చిత్తశుద్ధితో పోషిస్తుంది ' అన్నారు దుల్కర్ సల్మాన్.




## బిగ్‌బాస్ ఫేమ్ గౌతమ్ కృష్ణ కొత్త మూవీ

బిగ్ బాస్ 7 కంటెస్టెంట్ గౌతమ్ కృష్ణ హీరోగా నటిస్తోన్న తాజా చిత్రం 'సోలో బాయ్'. ఈ చిత్రంలో శ్వేతా అవస్తి, రమ్య పసుపులేటి హీరోయిన్లుగా నటించారు. నవీన్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సెవెన్ హిల్స్ ప్రొడక్షన్స్ పై సతీష్ కుమార్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేశారు మేకర్స్. వచ్చేనెల 4వ తేదీన థియేటర్లలో సందడి చేయనుందని ప్రకటించారు. బిగ్‌బాస్‌తో ఫేమ్ తెచ్చుకున్న గౌతమ్ కృష్ణ హీరోగా అభిమానులను అలరించనున్నారు. ఇప్పటికే రిలీజైన ఫస్ట్ లుక్ పోస్టర్ ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంది. ఈ కథ చాలా కొత్తగా అనిపించి, ఈ సినిమాను నిర్మించినట్లు డైరెక్టర్ నవీన్ అన్నారు. ఈ చిత్రం కచ్చితంగా అందరికి నచ్చుతుందని తెలిపారు. కాగా.. గౌతమ్ కృష్ణ గతంలో ఆకాశవీధుల్లో అనే చిత్రంలో నటించారు. ఇప్పటికే ఈ మూవీ నుంచి రిలీజైన పడిపోయానే సఖి అనే లిరికల్ సాంగ్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ రొమాంటిక్ లవ్ సాంగ్ ఆడియన్స్‌ను విపరీతంగా ఆకట్టుకుంది. ఈ చిత్రంలో పోసాని కృష్ణ మురళి, అనిత చౌదరి, డాక్టర్ భద్రం, అరుణ్ కుమార్, ఆర్కే మామ, షఫీ కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమాకు జుడా సంధి సంగీతమందించారు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
RNI TITLE CODE:TELTEL/2024/89359 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com